Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

## సంక్షోభం నుంచి గట్టెక్కిన అమెరికా

వాషింగ్టన్ : డీఫాల్ట్ ముప్పు నుంచి అమెరికా ఎట్టకేలకు బయటపడింది. అప్పుల పరిమితి పెంచేం దుకు. కొన్ని రకాల బడ్జెట్‌లలో కోత పెట్టడానికి ఉద్దేశించిన బిల్లును అమెరికా ప్రతిని ధుల సభ ఆమోదిం చింది. దానిని ఎగువ సభ సెనేట్‌కు పంపింది. సెనేట్ శనివారంలోపు దా నిని ఆమోదించనుంది. ప్రతినిధుల సభలో 314-117 ఓట్ల తేడాతో బిల్లు నెగ్గింది.

అటు సెనేటర్లలో కొందరు కొన్ని సవరణలు ప్రతిపాదిం చారు. కానీ సోమవారం లోపు బిల్లును ఆమోదిం చాల్సి ఉన్నందున వీటిని పరిగణనలోకి తీసుకోవడం అనుమానమేనని ఉ భయ పార్టీల నేతలు అంటున్నారు.

సంపుటి : 1 సంచిక : 132 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 జూన్ 2023 శనివారం పేజీలు : 4

# తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



## తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో సీఎం కేసీఆర్

హైదరాబాద్: తెలంగాణలో రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 21 రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గన్‌పార్క్‌లో అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం సచివాలయంలో సీఎం వేడుకలను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల శుభ సందర్భంలో ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నిరంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందుతోం దన్నారు. సంక్షేమంలో రాష్ట్రం స్వర్ణయుగాన్ని ఆవిష్కరించిందని, తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. 'సంపద పెంచుదాం-ప్రజలకు పంచుదాం' అని అన్నారు. మిషన్ భగీరథతో తాగునీటి సమస్యను పరిష్కరించామని, మన పల్లెలకు జాతీయస్థాయి అవార్డులు వస్తున్నాయని అన్నారు. నిన్నటి ఉద్యమ తెలంగాణ.. నేటి ఉజ్వల తెలంగాణ అని, సాగుకు ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని సీఎం పేర్కొన్నారు. 2014లో తెలంగాణ తలసరి ఆదాయం 1,24,104 మాత్రమే ఉండేదని, తెలంగాణ ప్రభుత్వం సాధించిన ప్రగతితో నేడు రాష్ట్ర తలసరి ఆదాయం 3 లక్షల 17 వేల 115 రూపాయలకు పెరిగిందని సీఎం కేసీఆర్ తెలిపారు. పదేళ్ల చిరుప్రాయంలో ఉన్న తెలంగాణ తలసరి ఆదాయంలో దేశంలోని పెద్ద రాష్ట్రాలకన్నా మిన్నగా నిలిచిందన్నారు. 2014లో రాష్ట్ర జీఎస్.డి.పి విలువ రూ.5,05,849 కోట్లు మాత్రమే ఉండగా, నేడు రాష్ట్రంలోని అన్నిరంగాలూ ఆర్థికంగా పరిపుష్టి కావడంతో రాష్ట్ర జీ.ఎస్.డి.పి 12,93,469 కోట్లకు పెరిగిందన్నారు. అంటే కరోనా, డీ మానిటైజేషన్ వంటి సంక్షోభాలు ఏర్పడినప్పటికీ తట్టుకొని 155 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తూ, దశాబ్ది ముంగిట తెలంగాణ నిలిచిందన్నారు. ఇవాళ రాష్ట్రంలో కరెంటు కోతలు లేవని, ఎటుచూసినా వరికోతలే కనిపిస్తున్నాయని సీఎం కేసీఆర్ అన్నారు. తలసరి విద్యుత్తు వినియోగంలో తెలంగాణ దేశంలోనే ప్రప్రథమ స్థానంలో నిలిచి, ప్రగతి బావుటాను సగర్వంగా ఎగురవేసిందన్నారు.

వృత్తి పనులవారికి ఆర్థిక ప్రేరణనివ్వడంతో తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టి చేకూరిందన్నారు. పల్లె ప్రగతితో గ్రామీణ జీవన ప్రమాణాలు పెరిగాయని, మన ఆదర్శ గ్రామాలు జాతీయ స్థాయిలో అనేక అవార్డులందుకుంటున్నాయని, పట్టణాలు, నగరాలు పరిశుభ్రతకు, పచ్చదనానికి నిలయాలై ప్రపంచస్థాయి గుర్తింపును పొందుతున్నాయన్నారు. ఏ విషయంలో చూసినా, ఏ కోణంలో చూసినా అనేకరంగాల్లో తెలంగాణ నంబర్ వన్‌గా నిలుస్తోందని, ఒక్క మాటలో చెప్పాలంటే.. నిన్నటి ఉద్యమ తెలంగాణ నేడు ఉజ్వల తెలంగాణగా వాసికెక్కిందన్నారు.

**దశాబ్ది ఉత్సవాల సందర్భంగా.. వృత్తి పనుల వారికి ఆర్థిక ప్రేరణ :** దశాబ్ది ఉత్సవాల కానుకగా బి.సి కుల వృత్తుల కుటుంబాలకు కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థికసాయం అందిస్తున్నామని చెప్పడానికి తానెంతో ఆనందిస్తున్నానని సీఎం కేసీఆర్ అన్నారు.

రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణ, కుమ్మరి, మేదరి తదితర కుటుంబాల వారికి దీనివల్ల ప్రయోజనం చేకూరుతుందన్నారు. అదే విధంగా గొల్ల కుర్మలకు భారీ ఎత్తున గొర్రెల పంపిణీని చేపట్టిన సంగతి తెలిసిందేనన్నారు. తొలి విడతలో రూ.6,100 కోట్లతో 3.93 లక్షల మంది లబ్ధిదారులకు 82.64 లక్షల




గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందని, ప్రస్తుతం రెండో విడతలో భాగంగా రూ.5 వేల కోట్లతో 3.38 లక్షల మందికి గొర్రెల్ని పంపిణీ చేసే కార్యక్రమం దశాబ్ది ఉత్సవాల్లోనే ప్రారంభమవుతుందన్నారు.

**పోడు భూములకు పట్టాలు :** తెలంగాణ దశాబ్ది వేడుకల వేళ ఆదివాసీ గిరిజనుల చిరకాల ఆకాంక్షను తెలంగాణ ప్రభుత్వం తీరుస్తున్నదని తెలియజేయడానికి నేనెంతో సంతోషిస్తున్నానని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. పోడు సమస్యకు శాశ్వత పరిష్కారంగా గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పిస్తున్నదని, జూన్ 24 నుంచి పోడు పట్టాల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుదుతుందన్నారు.

అటవీ భూములపై ఆధారపడిన ఒక లక్షా యాభైవేల మంది ఆదివాసీ, గిరిజనులకు నాలుగు లక్షల ఎకరాల పోడు భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తున్నదని, దీనికి రైతుబంధు పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ తెచ్చుకున్నది అప్పుల కోసమా?: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఉద్యమం కొనసాగించామని.. మనసా, వాచా, కర్మణా సకల జనులు పోరాడితేనే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు. తెలంగాణ కోసం అమరులైన వారిని స్మరించుకుందాం. ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నమస్సులు. ఒకరిద్దరి వల్లే తెలంగాణ రాలేదు. ప్రత్యేక రాష్ట్రం వచ్చేందుకు కృషి చేసిన దివంగత కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌కు ఈ సందర్భంగా నివాళులర్పిద్దాం. చిన్న రాష్ట్రాల వల్లే ప్రజల ఆకాంక్షలు నెరవేరతాయనేది భాజపా ఉద్దేశం. రాష్ట్రంలో కుటుంబపాలనతో ఎక్కడ చూసినా అవినీతి కనిపిస్తోంది. నేడు తెలంగాణ.. ఓ కుటుంబానికి బానిసగా మారే పరిస్థితి వచ్చింది. దొరికిన అన్ని చోట్లా అప్పులు తెస్తున్నారు. తెలంగాణ తెచ్చుకున్నది అప్పుల కోసమా? నిధులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఫామ్‌హౌస్‌లు పెరుగుతున్నాయే తప్ప డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వట్లేదు. దళితులకు మూడెకరాల భూమి హామీ ఏమైంది? దళితబంధులో ఎమ్మెల్యేలు వాటా తీసుకుంటున్నారు. పేదలకు అండగా నిలిచే ఆరోగ్యశ్రీని అటకెక్కించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు ఏమయ్యాయి? అమరవీరుల కుటుంబాల ప్రస్తుత పరిస్థితి ఏంటి?" అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.



## తెలంగాణ.. సాంస్కృతికంగా ఎంతో గుర్తింపు పొందింది..!

దిల్లీ: దేశంలో 29వ రాష్ట్రం తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. శుక్రవారం పదో ఏడాదిలో అడుగుపెట్టింది. ఈ కాలంలో రాష్ట్రం సాధించిన విజయాలను, సాంస్కృతిక వారసత్వాన్ని అభినందిస్తూ రాష్ట్రపతి, ప్రధాని వంటి ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తెలుగులో ట్వీట్ చేశారు. 'రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వం, ప్రతిభావంతులైన వ్యక్తులను కలిగి ఉంది. అడవులు, వన్యప్రాణులతో సమృద్ధిగా ఉంది. ఆ రాష్ట్రం ఆవిష్కరణల కేంద్రంగా ఎదుగుతోంది. తెలంగాణ అభివృద్ధి, శ్రేయస్సు ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నాను'అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందనలు తెలియజేశారు.

# 9 ఏళ్ల కేసీఆర్ పాలనలో

## ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకున్న తెలంగాణ : మంత్రి కేటీఆర్



కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం 9 ఏండ్ల స్వల్ప కాలంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా రూపుద్దిద్దుకుందని మంత్రి కేటీఆర్ అన్నారు. సంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్లా జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి కేటీఆర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుందనే స్థాయికి చేరుకుంది. ఇది ముమ్మాటికి ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని అన్నారు. కేసీఆర్ మానవీయ దృక్పథం, నిర్మాణాత్మక ఆలోచన, దార్శనీక ప్రణాళిక రచన, పారదర్శకమైన పరిపాలన.. వీటన్నింటి కలయిక అయిన తెలంగాణ మాడల్ నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన్ననలు అందుకుంటుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఆర్థిక మాంద్యం, కరోనా సంక్షోభం ఎదురైనప్పటికీ అన్నింటిని తట్టుకుని తెలంగాణ ఒక బలీయమైన ఆర్థిక శక్తిగా నిలబడగలగిందన్నారు. సంక్షోభ సమయంలోనూ సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను భారీ ఎత్తున నిరాటంకంగా అమలు చేయడం తెలంగాణ ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యమిస్తూ సమగ్ర అభివృద్ధిని సాధిస్తూ ముందుకుసాగుతున్నామని అన్నారు. అప్రతిహతంగా సాగుతున్న తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తనకంటూ ప్రత్యేకతను నిలుపుకుంటూ.. అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రాథమిక రంగమైన వ్యవసాయం అభివృద్ధియే ఇతర రంగాల అభివృద్ధికి ఆధారభూతంగా నిలుస్తుందన్నారు. సుసంపన్నమైన వ్యవసాయానికి తెలంగాణ.. నేడు దేశానికి దిశానిర్దేశం చేస్తుందని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న విధంగా రైతు సంక్షేమ విధానాలు తమ తమ రాష్ట్రాల్లో అమలు చేయాలని ఆయా రాష్ట్రాల రైతాంగం తమ రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తెస్తున్న పరిస్థితిని ఈ రోజు దేశంలోని అనేక రాష్ట్రాల్లో చూస్తున్నామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు పదేండ్లలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు అప్పటి ప్రభుత్వాలు అరకొర నిధులు ఖర్చు చేయగా.. రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి తెలంగాణ ప్రభుత్వం 20 రెట్ల నిధులు అధికంగా ఖర్చు చేసింది. రైతు స్వభావాన్ని నింపుకున్న కేసీఆర్ సుపరిపాలనలో రైతుల కండ్లలో దీనత్వం తొలగి.. ధీరత్వం తొణికిసలాడుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల కరెంట్, రైతు రుణమాఫీ, చెరువుల పునరుద్ధరణ, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం, భారీ ప్రాజెక్టుల నిర్మాణం, సకాలంలో ఎరువులు, విత్తనాల పంపిణీ, కల్తీ విత్తనాల నియంత్రణ, వ్యవసాయ విస్తరణ అధికారుల నియామకం, రైతు వేదికలు, పంట కల్లాల నిర్మాణం, రైతుబంధు సమితి.. ఇలా లెక్కకు మించిన అద్భుతమైన పథకాలు, సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చారని చెప్పారు.. దుక్కి దున్నింది మొదలు.. పండిన పంట కొనుగోలు చేసే దాకా అడుగడుగున రైతన్నకు కొండంత అండగా ప్రభుత్వాన్ని నిలిపి.. దండుగ అన్న వ్యవసాయాన్ని పండుగగా మార్చిన నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. సాగు జలాలు, భూగర్భ జలాలు అసాధారణంగా పెరగడం వల్ల రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2016లో ఉన్న 1,77,960 ఎకరాల నికర సాగుభూమి కాస్త 2,40,430 ఎకరాలకు పెరిగింది. రైతుబంధు పథకం ద్వారా సిరిసిల్ల జిల్లాలో పది విడతల్లో 1,33,658 మంది రైతులకు 1130 కోట్ల రూపాయలను రైతు ఖాతాల్లో నేరుగా జమచేశాం. రైతులకు సుస్థిరమైన ఆదాయం రావాలి, మెరుగ్గా బతకాలనే ఉద్దేశంతో తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాం. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించుకున్నాం.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటివరకు దాదాపు వెయ్యి ఎకరాల్లో 292 మంది రైతులు ఆయిల్ పామ్ సాగుచేస్తున్నారు. అని మంత్రి కేటీఆర్ అన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం గోదాముల నిర్మాణం చేపట్టింది. తెలంగాణ రాకముందు కేవలం 4200 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 14 వ్యవసాయ గోదాములు ఆనాడు ఉంటే.. రాష్ట్ర ఏర్పాటు అనంతరం 33 కోట్లతో 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఆధునిక గోదాములను సిరిసిల్ల జిల్లాలో నిర్మించుకున్నాం. తెలంగాణ ఏర్పడకుముందు జిల్లాలో 3 వ్యవసాయ కమిటీలు మాత్రమే ఉండగా.. రైతుల సౌలభ్యం కోసం మరో 5 కమిటీలను కూడా ఏర్పాటు చేసుకున్నాం. అని అన్నారు.

## సంపాదకీయం

# బీజేపీ డ్యూటీ ఎక్కిన స్టార్ పొలిటీషియన్

స్టార్ పొలిటీషియన్.. ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ఇప్పుడు బీజేపీలో ఉన్న విషయం తెలిసిందే. ఆదిలో ఆయన తండ్రి నుంచి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో సుమారు 35 సంవత్సరాలు ఉన్నారు. దీంతో అనేక పదవులు ఆయనను వరించాయి. అయితే.. రాష్ట్ర విబజనను తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా..పార్టీ అధిష్టానం తన సూచనలు పరిగణనలోకి తీసుకోలేదని .. చెప్పి. పార్టీ నుంచి బయటకు వచ్చారు. ఈ క్రమంలోనే సమైక్యాంధ్ర పార్టీని స్థాపించారు. 2014లో పోటీకి కూడా అభ్యర్థులను నిలిపారు. కానీ అందరూ ఓడిపోయారు. తర్వాత.. సుమారు నాలుగేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉన్న కిరణ్కుమార్‌రెడ్డి.. మళ్లీ కాంగ్రెస్ పిలిచిందంటూ.. ఆ పార్టీలోనే చేరారు. మళ్లీ పార్టీ పరిస్థితి ఎక్కడా పుంజుకునేలా కనిపించడం లేదంటూ.. ఆయన మౌనంగా ఉన్నారు. ఈ క్రమంలోనే ఆరు మాసాల కిందట.. ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు అయిత.. ఈ ఆరుమాసా ల్లోనూ కర్ణాటక ఎన్నికలు వచ్చాయి. ఒకటి రెండురోజులు అక్కడ పర్యటించి.. బీజేపీకి ఆయన ప్రచారం చేశారు. అయితే.. బీజేపీ ఓడిపోయింది. ఇక రెండు మూడు రోజుల తర్వాత.. ఆయన అమెరికా పర్యటనకు వెళ్లారు. ఇదిలావుంటే.. తాజాగా ఆయన ఏపీ రాజకీయాలపై స్పందించారు. త్వరలోనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని అన్నారు. అయితే.. ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీపై కానీ.. సీఎం జగన్పై కానీ ఆయన ఎక్కడా స్పందించలేదు. సమయం వచ్చినప్పుడు స్పందిస్తానని చెప్పారు. తనకు ఉన్న బలంతో బీజేపీని బలోపేతం చేస్తానని కిరణ్కుమార్‌రెడ్డి చెప్పారు. ఇక ఆయనను ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజు కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే.. సీనియర్ నాయకుడు అయిన.. కిరణ్కుమార్‌రెడ్డి నుంచి సూచనలు.. సలహాలు తీసుకునేందుకు తాను ఆయనను కలిసినట్టు సోము చెప్పారు.

**ఇదీ.. సంగతి! :** వచ్చే 2024 ఎన్నికల నాటికి గౌరవ ప్రదమైన స్థానాల్లో గెలుపు గుర్రం ఎక్కాలని .. ఏపీపై బీజేపీ పెద్దలు వ్యూహాలు రచిస్తున్నారు. ఈక్రమంలో గత ఎన్నికలకు ముందు.. కాపు సామాజిక వర్గానికి వర్గానికి ప్రాధాన్యం ఇస్తూ.. సోము వీర్రాజును ఇక్కడ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. అయితే.. ఆయన నేతృత్వంలో వచ్చిన ఎన్నికలు.. అన్నీ కూడా విఫలమయ్యారు. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల నాటికి అధ్యక్షుడిని మార్చడం ఖాయమనే సంకేతాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ పగ్గాలను కిరణ్కుమార్‌రెడ్డికి ఇవ్వడం ద్వారా.. బలమైన రెడ్డి సామాజిక వర్గాన్ని బీజేపీ వైపు ఆకర్షించి.. వైసీపీఓటు బ్యాంకు కు గండికొట్టే ప్రయత్నం చేస్తున్నారన వాదన వినిపిస్తోంది. అంటే.. మొత్తంగా.. త్వరలోనే కిరణ్కు బీజేపీ ఏపీ పగ్గాలు అందించడం ఖాయమనే లెక్కలు..సూచనలు వస్తుండడం గమనార్హం.

# హనుమా... కబ్జా కనుమా!



మెదక్ : అల్లాదుర్గం మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయ మాన్యాన్ని క్రమంగా మాయం చేసే కుట్ర జరుగుతోంది. తక్షణం స్పందించి వాటిని కాపాడుకోవాల్సిన దేవాదాయ శాఖ అధికారులు నామమాత్రంగానే స్పందిస్తున్నారు. ఎకరా దాదాపు రూ.80 లక్షలు పలుకుతున్న చోట వారి ఉదాసీన వైఖరి వల్ల తీరని నష్టం వాటిల్లే పరిస్థితి తలెత్తుతోంది. భూవిస్తీర్ణానికి సంబంధించి ఒక్కో రికార్డులో ఒక్కోలా వివరాలు నమోదు చేయడం అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారులు ఒకలా.. దేవాదాయ శాఖ మరోలా విస్తీర్ణాన్ని చూపుతోంది. రెండు శాఖలు సమన్వయంతో పనిచేసి సర్వే చేస్తేనే అసలు సంగతి వెలుగులోకి వస్తుంది. ఎవరికి వారే అన్నట్లు ఉండటంతో.. హనుమంతుడి భూములపై కబ్జాదారులు కన్నేశారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో 'ఈనాడు-ఈటీవీ తెలంగాణ' పరిశీలన చేపట్టింది. 40 ఎకరాలకు పైగా..అల్లాదుర్గంలో సర్వే సంఖ్య 557 ఉంది. రెవెన్యూ రికార్డులను పరిశీలించగా... ఖాస్రా పహాణీ (1954-55)లో ఈ సర్వే సంఖ్యకు సంబంధించిన వివరాలు లేవు. ఆ మేరకు కాగితం చినిగిపోయింది. 1955 నుంచి 1958 వరకున్న దస్త్రాలను చూడగా.. ఈ సర్వేసంఖ్యలో పూర్తి విస్తీర్ణం 40.25 ఎకరాలున్నట్లు నమోదయింది. మాఫీ ఇనాం భూములుగా చూపి కొందరు రైతుల పేర్లు అప్పట్లోనే చేర్చారు. ఆ తర్వాతి కాలంలో ఇవి దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. జులై, 2020లో అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్ జిల్లా ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదే విషయమై అప్పటి పాలనాధికారి ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. అల్లాదుర్గం తహసీల్దారు స్పందించి ఈ సర్వే సంఖ్యలో 37.10 ఎకరాలు దేవాదాయ భూములున్నట్లు తేల్చారు. దేవాదాయ అధికారులు మాత్రం పూర్తి విస్తీర్ణం తమదేనంటున్నారు. ఈ భూములకు సంబంధించిన రికార్డుల్లో తమ పేర్లు నమోదై ఉన్న రైతులు... ఇవి తమకే చెందుతాయంటున్నారు. నిషేధిత జాబితాలో చేర్చినా..కొన్నేళ్ల క్రితమే 40.25 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చామని అధికారులంటున్నారు. దేవాదాయశాఖకు చెందినవేనని స్పష్టం చేస్తున్నారు. తాజాగా రికార్డుల్లో పరిశీలించగా... ఏకంగా 55 ఎకరాల విస్తీర్ణం రైతుల పేరిట నమోదై ఉంది. 2018లో భూదస్త్రాల ప్రక్షాళన సందర్భంగా అప్పటి తహసీల్దారు వారి పేర్ల మీద పాసుపుస్తకాలు ఇచ్చారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఒకవేళ రైతుల పేర్లు చేర్చాలనుకుంటే సదరు భూముల విషయమై తమకూ నోటీసులు ఇవ్వాలి కదా అంటూ దేవాదాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం కనిపిస్తోంది. పలుమార్లు ఈరెండు విభాగాల మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు జరిగినా... ఇప్పటి వరకు సర్వే నిర్వహించ లేదు.

బోర్డులు తొలగించేశారు...ఇటీవల కొందరు భూములను చదును చేశారు. ఒక గదిని కూడా నిర్మించారు. సమాచారం రావడంతో దేవాదాయ, రెవెన్యూ అధికారులు భూముల వద్ద బోర్డును పాతారు. స్థానికంగా ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయంతో పాటు ప్రధాన రహదారిపైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇవన్నీ దేవాదాయ భూములేనని, ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. సర్వే చేసే వరకు ఈ సర్వే సంఖ్యలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. వారి ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్మాణాన్ని పూర్తి చేసి.. ఏర్పాటు చేసిన బోర్డు తొలగించారు. ఫ్లెక్సీలను చించేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వే పూర్తి చేస్తేనే.. వాస్తవాలు వెలుగుచూస్తాయి.

ఇప్పటికే లేఖ రాశాం..భూములు దేవాదాయశాఖకు చెందినవేనని గతంలో ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కొందరు రైతులు వచ్చి కొంతభాగం తమవంటున్నారు. ఇప్పుడు రికార్డులను పరిశీలిస్తే దాదాపు 55 ఎకరాలు రైతుల పేరిటే ఉంది. భూదస్త్రాల ప్రక్షాళన సందర్భంగా చేర్చినట్లు స్పష్టమవుతోంది. అప్పుడు అలా ఎందుకు చేశారో తేల్చాలి. పరిరక్షించాలంటే సర్వే చేపట్టడమే మార్గం. దేవాదాయ శాఖ అధికారులకు ఇదే విషయమై లేఖ రాశాం. బోర్డులు తొలగించిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని వారికి సూచించాం. ప్రస్తుతం ఈ 40.25 ఎకరాల భూమి నిషేధిత జాబితాలోనే ఉంది. ఎలాంటి క్రయవిక్రయాలు జరగడానికి వీల్లేదు.- వెంకటేశ్వర్లు, తహసీల్దారు, అల్లాదుర్గం

# పల్లె ముంగిట్లో.. సర్కారు వైద్యం




సంగారెడ్డి : 'పేదలెవరూ ప్రైవేటు ఆస్పత్రులకెళ్లొద్దు ప్రభుత్వ దవాఖానాల్లో అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నాం. పల్లెల్లో వైద్యులను అందుబాటులోకి తేవడం మొదలు పట్టణాల్లో అత్యాధునిక వసతులు సమకూరుస్తున్నాం. డబ్బులున్న వారు ప్రైవేటుకు వెళతామంటే.. అది వారిష్టం. పేదలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను వాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. చింతల్‌పల్లిలో బస్తీదవాఖానాను ప్రారంభించాం. ఇంకా అవసరమున్న చోట్ల వీటిని అందుబాటులోకి తెస్తాం' - ఈనెల 19న సంగారెడ్డిలో వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

గ్రామస్థాయిలోనే సర్కారు వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చాలా ఊళ్లకు దూరంగా ఉండటంతో.. స్థానికంగా మెరుగైన చికిత్సలు ప్రజలకు చేరువ చేసేలా 'పల్లె దవాఖానా'లనూ ఏర్పాటు చేస్తోంది. జిల్లాకు ఇప్పటికే 122 మంజూరయ్యాయి. ప్రతి పల్లె దవాఖానాలోనూ ఒక ఎంబీబీఎస్ వైద్యుడు, ఒక ఏఎన్ఎం, ఒక ఆశా కార్యకర్త ఉంటారు. సాధారణ చికిత్సలకోసం దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా పల్లెవాసులు.. తమ ఉన్న ఊర్లోనే వైద్యసాయం పొందేలా చూడటమే ప్రధాన లక్ష్యం.

తగ్గనున్న దూరాభారం

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా 104 ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. వీటితో పాటు మరో 18చోట్ల కలిపి 122 పల్లె దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వైద్యుల నియామకాల కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. కేవలం 31 మంది మాత్రమే స్పందించారు. వారిని ఇప్పటికే విధుల్లోకి తీసుకున్నారు. మిగతా చోట్ల భర్తీ చేసేలా వైద్యాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గ్రామీణులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని వారు వివరిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మాదిరిగానే ఇక్కడా రోగులను పరీక్షించి వారికి ఔషధాలిస్తారు. టీకాలు వేయడం మొదలు వ్యాధి నిర్ధారణ పరీక్షల నమూనాలు సేకరించడం...ఇలా అన్ని పనులూ చేస్తారు. ప్రస్తుతం ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో కనిష్ఠంగా మూడు నుంచి గరిష్ఠంగా 19 వరకు ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. ఉపకేంద్రాల్లో వైద్యుడు అందుబాటులో లేకపోవడం వల్ల పల్లెవాసులు దూరంగా ఉన్న పీహెచ్‌సీకి వెళుతున్నారు. ఇకపై వీరికి దూరాభారం తగ్గుతుంది.

టెలీమెడిసిన్ సేవలూ...

పల్లె దవాఖానాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో అనుసంధానిస్తారు. ఈ-సంజీవని ద్వారా టెలీమెడిసిన్ సేవలు అందించనున్నారు. పల్లెదవాఖానాలో ఉన్న వైద్యుడు, ఇతర సిబ్బంది ఈ సేవను వాడుకొని నిపుణులతో మాట్లాడి.. తమవద్దకు వచ్చిన రోగులకు మెరుగైన చికిత్స చేసేందుకు ఇది దోహదం చేయనుంది. హైరిస్క్ కేసులున్నా.. తక్షణం గుర్తించడం సాధ్యమవుతుంది.

కొత్తగా మూడు పీహెచ్‌సీలు

జిల్లాలో ప్రస్తుతం 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 అర్బన్ కేంద్రాలున్నాయి. తాలెల్మ పీహెచ్‌సీ కింద 19 ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. కొత్తగా వట్‌పల్లి మండలంగా ఏర్పాటైనా... ఇక్కడ పీహెచ్‌సీ లేదు. దీంతో రోగులకు దూరాభారమవుతోంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని వట్‌పల్లిలో కొత్తగా పీహెచ్‌సీని ప్రతిపాదించారు. మొగుడంపల్లి మండలంలో 75వేల జనాభా ఉంది. ఇక్కడ కొత్తగా రెండు పీహెచ్‌సీలు కావాలని ఉన్నతాధికారులకు నివేదించారు. కోహిర్ మండలంలోని బిలాల్‌పూర్‌లో ఆరోగ్యకేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చి సేవలందిస్తున్నారు.

బస్తీల్లో సుస్తీ పోగొట్టేలా..

బస్తీల్లో సుస్తీ పోగొట్టే ఉద్దేశంతో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి హరీశ్‌రావు ఇటీవల ప్రకటించారు. జిల్లాలోని రామచంద్రాపురం పరిధిలో అయిదు, తెల్లాపూర్‌లో ఒకటి, పటాన్‌చెరులో ఒకటి చొప్పున బస్తీ దవాఖానాలు అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల అమీన్‌పూర్‌లో మరోమూడు ప్రారంభించారు. ఈనెల 19న సంగారెడ్డిలో పర్యటించిన హరీశ్‌రావు చింతల్‌పల్లిలో బస్తీదవాఖాను ప్రారంభించి... ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానికులను కోరారు. ఐడీఏ బొల్లారంలో దవాఖానాను సిద్ధం చేశారు. జహీరాబాద్‌లోనూ ఈనెల 23న మంత్రి హరీశ్‌రావు బస్తీదవాఖానాను ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా ప్రారంభించనున్నారు. సదాశివపేటకూ ఒకటి మంజూరు చేయనున్నారు.

# అక్షర నిలయం.. ఆపసోపాల వలయం..!

సంగారెడ్డి : ఏకాగ్రతతో దృష్టిసారించి విద్యాభ్యాసం చేయాల్సిన చిన్నారులు.. బిక్కుబిక్కుమంటూ బడిలో కాలం గడుపుతున్నారు. వానొస్తే చాలు.. కొన్నిచోట్ల పాఠశాలకు సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి. ఎండైనా, వర్షమైనా.. పరిస్థితి ఏదైనా చెట్ల కిందనే కూర్చొని చదువుకోవాల్సిన దుస్థితి. పెచ్చులూడుతున్న గదుల్లోనే ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. వరండా.. పంచాయతీ కార్యాలయం ఇలా ఎక్కడ వీలైతే అక్కడకు పిల్లలకు పట్టుకెళ్లి పాఠాలు చెబుతున్నారు. 'మన ఊరు- మన బడి' కింద కొన్నింటిని ఎంపిక చేసినా పూర్తిస్థాయిలో పనులు కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు ఇటీవలి వర్షాలకు పలు బడులు మరింత ప్రమాదకరంగా మారాయి. దీనికితోడు ఆవరణలో నీళ్లు నిలిచాయి. ఇక బురదతో నడవలేని పరిస్థితి. ఉమ్మడి మెదక్, వికారాబాద్, జిల్లాల్లో పరిశీలించగా.. దయనీయ పరిస్థితులు కనిపించాయి.

మునిపల్లి మండలం బొడిశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులున్నారు. పాత భవనం శిథిలం కావడంతో అయిదేళ్ల క్రితం కొత్తగా నిర్మాణం ప్రారంభించారు. అది అసంపూర్తిగా ఉండటంతో నిరుపయోగంగా మారింది. దీంతో ప్రస్తుతం పంచాయతీ కార్యాలయాన్నే బడిగా మార్చేశారు. అంతారం ఉన్నత పాఠశాలలో ఆరు



గదులు శిథిలావస్థకు చేరాయి. ఇటీవల పెచ్చులూడిపడగా.. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం ఒక గదిని పూర్తిగా వాడటం లేదు. మిగతా అయిదింటిలో పెచ్చులూడి వెక్కిరిస్తున్నాయి.పరిగి మండలం లక్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు పాడయ్యాయి. నాలుగు నెలల క్రితం పెచ్చులూడాయి. ఆరుబయటే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇదే మండలం రావులపల్లి పాఠశాలలో నడిమధ్యలో శిథిల భవనం ఉంది. పిల్లలు ఆడుకునే సమయంలో అందులోకి వెళ్తుంటారు. ప్రమాదం జరగడానికి అవకాశాలెక్కువ.

నవాబుపేట మండలంలోని ప్రాథమిక పాఠశాలలో వర్షం కురిస్తే చాలు జల్లుపడుతోంది. గోడలకు పగుళ్లు రావడంతో వాన నీరు గదుల్లోకి వచ్చి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అందులోనే పాఠాలు చెబుతున్నారు. వికారాబాద్ మండలం రాళ్లచట్టంపల్లి ప్రాథమిక పాఠశాల కప్పునుంచి తరచూ పెచ్చులు రాలుతున్నాయి. వికారాబాద్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గోడలు వర్షం వస్తే నాని ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి నెలకొంది. పెద్దశంకరంపేట మండలం ఉత్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో వరండాలోనే తరగతులు కొనసాగిస్తున్నారు. ఈ వరండాకు ఒకవైపు ఉన్న గోడ పూర్తిస్థాయిలో పగుళ్లిచ్చింది. ఎప్పుడు పెచ్చూలుడుతున్నాయి. 120 మంది విద్యార్థులు, అయిదుగురు ఉపాధ్యాయులున్నారు. కేవలం మూడు గదులే ఉన్నాయి. అందులోనూ ఒకటి కురుస్తోంది. వారిని తీసుకొచ్చి వరండాలో కూర్చొబెడుతున్నారు.

పాపన్నపేట మండలం చిత్రియాల ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులున్నారు. రెండే గదులున్నాయి. వానాకాలంలో తీవ్ర అవస్థలు తప్పడం లేదు. ఏమాత్రం చినుకులుపడ్డా స్లాబ్ నుంచి నీరు లోనికి వచ్చేస్తోంది. ఇప్పటికే పునాది కూడా దెబ్బతింది. భయంభయంగానే పిల్లలు పాఠాలు వినాల్సి వస్తోంది.

చేగుంట జడ్పీ ఉన్నత పాఠశాల పరిస్థితి ఇది. ఆవరణ మొత్తం బురదమయంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోపలికి వెళ్లేందుకు కష్టంగా మారింది. బురదలో పిల్లలు జారిపడుతున్నారు. ఆడుకునేందుకు స్థలం లేక అందులో ఆడాల్సి వస్తోంది. ఇటీవలి వానలకు ఇలా మారగా.. కనీసం మొరం పోసినా ఇబ్బందులు తీరే అవకాశం ఉంది.మిరుదొడ్డి మండలం మాదన్నపేట ప్రాథమిక పాఠశాలలో గదులు శిథిలావస్థకు చేరాయి. వానొస్తే కురుస్తాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. ఇక్కడ ప్రస్తుతం 46 మంది పిల్లలు చదువుకుంటుండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఒకటి, రెండు, మూడు తరగతులను గదుల్లో నిర్వహిస్తున్నారు. నాలుగో, అయిదో తరగతి విద్యార్థులకు చెట్ల నీడే ఆధారం. వర్షం కురిస్తే వీళ్లు ఇంటికి వెళ్లాల్సిందే. ఉపాధ్యాయులు ఆ రోజు సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి.

శివ్వంపేట మండలం మగ్దూంపూర్ ప్రాథమిక పాఠశాలలో గదులు శిథిలమై నాలుగేళ్లు గడిచింది. కూలుతాయనే భయంతో అప్పటి నుంచి 3, 4, 5 తరగతులను చెట్ల కింద నిర్వహిస్తున్నారు. మిగతా రెండు తరగతుల పిల్లలను పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో కూర్చోబెడుతున్నారు. 58 మంది చిన్నారులున్న ఈ బడికి వర్షం వచ్చిందంటే సెలవే.

# ఉపాధి హామీతో.. చెరువుల పునరుద్ధరణ

గజ్వేల్ : దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేపట్టి.. పునరుద్ధరించేందుకు కేంద్రం ప్రభుత్వం అమృత్ సరోవర్ పథకం అమలు చేస్తోంది. ఉపాధి హామీ పథకం కింద ఈ పనులు చేపట్టనున్నారు. తొలి దశగా జిల్లాలో 54 చెరువులను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 1.10 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా సుమారు 3 వేలకుపైగా చెరువులు ఉన్నాయి. ఇందులో చాలా వాటిని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ పథకం ద్వారా పటిష్టం చేశారు. ఈక్రమంలో చిన్నపాటి చెరువులు మిగిలిపోగా వర్షాలకు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల కట్టలు తెగిపోయాయి. వాటిని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయటంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు పనులు కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్రం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. మొత్తం 75 చెరువులను ఎంపిక చేయగా ఏడాదిలో 54 చెరువులను పునరుద్ధరించనున్నారు. పూడిక తీయటం తదిత పనుల్లో చాలా వరకు యంత్రాలు వినియోగించకుండా కూలీలకే ఉపాధి కల్పించనున్నారు. అత్యధికంగా దుబ్బాక మండలంలో..జిల్లాలో అత్యధికంగా దుబ్బాక మండల పరిధిలో 6 చెరువులను.. అత్యల్పంగా కొండపాక, హుస్నాబాద్, నారాయణరావుపేట, కొమురవెల్లి మండలాల్లో ఒక్కోదాన్ని ఎంపిక చేశారు. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు వెచ్చించి బాగు చేయనున్నారు. పథకం కింద ఎంపిక చేసినవే కాకుండా జిల్లాలో మరిన్ని చెరువులు సైతం దెబ్బతిన్నాయి. వాటికి కూడా మరమ్మతులు చేస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. ఈవిషయంగా డీఆర్‌డీఓ గోపాల్‌రావు మాట్లాడుతూ రెండు విడతల్లో పనులు చేపట్టి వచ్చే ఏడాదిలోపు పూర్తి చేస్తామన్నారు.

# ఔరా.. సౌర

సింగరేణి : అధిక ఉష్ణోగ్రతలు ఓవైపు ప్రజల్ని ఠారెత్తిస్తుంటే... అదే భానుడి ప్రతాపాన్ని సింగరేణి సంస్థ ప్రయోజనకరంగా మలుచుకుంటోంది! వివిధ ఏరియాల్లో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు కేంద్రాల్లో లక్ష్యంలో నూరు శాతానికి పైగా ఉత్పత్తి నమోదవుతుండటం విశేషం. ఇతర సీజన్లతో పోల్చి చూస్తే కొద్ది వారాలుగా ఆయా యూనిట్లు పూర్తి ఉత్పత్తి సామర్థ్యంలో పనిచేస్తున్నాయి. ప్రతినెలా సగటున కనీసం 89 నుంచి 90 శాతం మధ్య ఉత్పత్తి నమోదవుతుంది. గత వర్షాకాలంలో ఇది 57 శాతంగానే ఉంది. భానుడి జాడ పెద్దగా లేకపోవడమే దీనికి కారణం. గత నెలలో దాదాపు చాలా రోజులు సూరీడు భగభగలాడటంతో సింగరేణి వ్యాప్తంగా ఉన్న సౌర యూనిట్లు పూర్తి సామర్థ్యాన్ని అందుకున్నాయి. శతశాతం విద్యుత్తు లక్ష్యాన్ని అధిగమిస్తున్నాయి. సింగరేణి సంస్థ మందమర్రి



(2), కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, రామగుండం-3, భూపాలపల్లి, ఎస్టీపీపీ(2) ప్రాంతాల్లో సౌర విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా జైపూర్‌లోని ఎస్టీపీపీలో నీటిపై తేలియాడే యూనిట్ను 5 మెగావాట్ల సామర్థ్యంతో ప్రారంభించింది. మే నెలలో ఎండలు మండుతుండటంతో అన్ని ఏరియాలు లక్ష్యాన్ని మించి ఉత్పత్తి చేస్తుండడం గమనార్హం. మరో మూడ్రోజులు మిగిలి ఉండగానే 107 శాతం సౌర విద్యుత్తు లక్ష్యం చేరడం గమనార్హం. ఈ నెలలో ఇప్పటి వరకు 2,54,05,600 యూనిట్లకు 2,70,99,539 యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయడం విశేషం.

# మానేరు తీరం సుందరీకరణ ఎప్పుడో?

సిరిసిల్ల : చరిత్రలో అద్భుతమైన నాగరికతలు.. నగరాలు నదీ తీరాల్లోనే పుట్టుకొచ్చాయి. జిల్లాలోని మానేరు వాగు వెంట గొప్పనగరాలేవి ఏర్పడక పోయినా.. దీనికున్న చారిత్రక నేపథ్యం గొప్పది. దీని ప్రాధాన్యతను భవిష్యత్తు తరాలకు తెలియజేసేలా సుందరీకరించాలని నిర్ణయించారు. రెండేళ్లుగా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మెట్ట ప్రాంతానికి మానేరు ఓ జీవనదిలా ఉంది. దీనిపై మాన్వాడ వద్ద నిర్మించిన రాజరాజేశ్వర జలాశయం వెనక జలాలు సిరిసిల్ల పట్టణం వరకు విస్తరిస్తాయి. సిరిసిల్ల పట్టణం రామప్పగుట్ట నుంచి సాయినగర్ చెక్‌డ్యాం వరకు సుందరీకరించాలని నాలుగేళ్ల క్రితమే ప్రణాళికలు చేశారు. దీనిలో మొదటి దశ రామప్పగుట్ట నుంచి సిరిసిల్ల వంతెన వరకు కరకట్ట నిర్మాణం పూర్తయింది. రెండో దశ వంతెన నుంచి సాయినగర్ చెక్‌డ్యాం వరకు నిర్మించాల్సి ఉంది. దీనికి గతేడాది రూ.38 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభంలోనే నిలిచిపోయాయి. మారిన సాయినగర్ చెక్‌డ్యాం డిజైన్‌లో కలిపి కరకట్టను నిర్మించాలని ప్రణాళికలు మార్చారు. రాజరాజేశ్వర జలాశయం వెనక జలాలు నిలిచే మానేరు వంతెన నుంచి సాయినగర్ వరకు 2.2 కిలోమీటర్ల పొడవునా కరకట్ట నిర్మించాలి. వాగులో ఏడాది పొడవునా నీరు నిలిచి ఉండటంతో ఎగువ సాయినగర్ వద్ద ఉన్న చెక్‌డ్యాం కాంక్రీటు కట్టలు బలహీనంగా మారి వరదలకు కొట్టుకుపోతున్నాయి. దీని డిజైన్ మార్చాలని రాష్ట్ర చెక్‌డ్యాం సలహా కమిటీ సభ్యుడు విజయ్‌ప్రకాష్ ఇటీవల కోతకు గురైన చెక్‌డ్యాంను పరిశీలించారు. దీని ఎత్తును 150 మీటర్లకు పెంచాలని నిర్ణయించారు. ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని సూచించారు. అప్పుడే ఎగువ నుంచి వచ్చే వరదను చెక్‌డ్యాం తట్టుకుంటుందన్నారు.

కరకట్ట 10 నుంచి 18 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. దీనిలో స్థలాన్ని బట్టి మధ్యలో పిల్లల పార్కులు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, యోగా చేసుకునేలా పార్కులు ఏర్పాటు చేయనున్నారు. కరకట్ట కింది నుంచి మట్టితో కాకుండా వాగువైపు కాంక్రీటు గోడను నిర్మించి మట్టిని నింపనున్నారు. సివిల్, కాంక్రీటు పనులు పూర్తయ్యాక టూరిజం శాఖకు అప్పగిస్తారు. పురపాలిక శాఖతో కలిసి సుందరీకరణ పనులు చేయాల్సి ఉంటుంది. దీనికోసం ఇప్పటికే వరంగల్‌లోని భద్రకాళి చెరువు సుందరీకరణ పనులు నిర్వహించిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంటు (కూడా)లోని ఇంజినీర్ల బృందం కరకట్ట ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లింది. మట్టి కట్ట పనులు పూర్తయితేనే సుందరీకరణ పనులు ప్రారంభించాల్సి ఉంటుంది.

అనుమతి లేక..రెండు కిలోమీటర్ల పైన కరకట్ట నిర్మాణానికి మట్టి కొరత తీవ్రంగా ఉంది. జిల్లాలో లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకాలకు గనులశాఖ ఎక్కడా అనుమతులు ఇవ్వలేదు. అగ్రహారం గుట్టలకు మట్టి తవ్వకాలపై ఫిర్యాదులు ఉండటంతో అనుమతులు ఇవ్వడం లేదు. బోయినపల్లి మండలంలో అదనపు టీఎంసీ పనుల్లో కాల్వ తవ్వకాల్లో వెలువడుతున్న మట్టిని గనులశాఖ వేబిల్లుతో కరకట్టకు వినియోగించేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ ప్రయత్నం ఫలిస్తే మట్టి ఇబ్బందులు తొలగినట్లే.

వరద నీటి మళ్లింపు ఎలా?

సిరిసిల్ల పట్టణం ఎగువ నుంచి వచ్చే వరద నీరంతా మానేరులోనే కలవాలి. ఇప్పటికే రామప్పగుట్ట నుంచి మానేరు వంతెన వరకు కరకట్ట నిర్మాణంతో వరద నీరు వెళ్లలేక ఆ ప్రాంతమంతా ముంపునకు గురైంది. ఇక్కడ నీటిని తోడేందుకే లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అదే పొరపాటు ఇక్కడా పునరావృతం కాకుండా చూస్తున్నారు. మరోవైపు సిరిసిల్ల పట్టణంలోని ముంపు సమస్యను పరిష్కరించాలని రూ.200 కోట్లతో బాక్స్ డ్రెయిన్ల నిర్మాణానికి జలవనరులశాఖ ప్రణాళికలు చేసింది. పట్టణానికి నాలుగువైపులా పెద్దబోనాల మీదుగా సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యవలయ రహదారి పక్క నుంచి ఆరెపల్లి వరకు, రగుడు, కలెక్టరేట్ ముందు నుంచి రామప్పగుట్ట, రాజీవ్‌నగర్, ముష్టిపల్లి నుంచి రగుడు కూడలి, కొత్తచెరువు నుంచి కలెక్టరేట్ వెనక వైపు 22 కిలోమీటర్ల పొడవునా బాక్స్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. నిధుల వ్యయం భారీగా ఉండటంతో ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేస్తున్నారు. ఇది కొలిక్కి వస్తేనే కరకట్ట పనులు ముందుకు సాగే అవకాశం ఉంది.

త్వరలో ప్రారంభిస్తాం

పనులు ప్రారంభించిన మొదట్లో మట్టి కొరత ఏర్పడింది. దీనికి తోడు పనుల్లో స్వల్ప మార్పులు చేయాల్సి వచ్చింది. మంత్రి కేటీఆర్ సూచనలతో త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి

# వరద కాల్వపై సమాంతరంగా రహదారి



కరీంనగర్ : గత కొన్నేళ్లుగా నరకప్రాయంగా మారిన గణేశ్‌నగర్ బైపాసు రహదారి స్మార్ట్‌సిటీలో మెరుగు పర్చేందుకు అధిక నిధులు కేటాయించారు. కూలిపోయిన వరదకాల్వ పనులతోపాటు రహదారి నిర్మాణ పనులు చకచకా పూర్తి చేస్తుండటంతో ఆ పనులు తుది దశకు చేరాయి. హైదరాబాద్ రోడ్డు నుంచి నేరుగా కలెక్టరేట్, భగత్‌నగర్ వచ్చేందుకు మార్గం సుగమం కానుండటంతో వాహనాల రద్దీ పెరిగే అవకాశముంది. మూడేళ్ల కిందట సీఎంఏ నిధులతో వరదకాల్వ, రహదారి నిర్మించాలని భావించి పనులు అప్పగించగా.. సదరు గుత్తేదారు కొంతమేర పనులు ప్రారంభించి పత్తా లేకుండా పోయారు. ఆ ప్రాంతవాసుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరగడంతో చివరకు స్మార్ట్ ప్రాజెక్టులో చేర్చి ఏడాదిలోనే మార్పు తీసుకొచ్చారు. వరదకాల్వపై స్లాబు వేసి రహదారి విశాలంగా మారుస్తుండటంతో ఆ రహదారి గుండా అధిక సామర్థ్యంగల వాహనాలు ప్రయాణిస్తే ఆ స్లాబు తట్టుకుంటుందా? అనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి.

అధికారుల పరిశీలన అవసరం

రహదారి కావడంతో ఏ సమయంలో ఏ వాహనం ఎంత బరువుతో ఆ వైపు వస్తుందో ఊహించడం కష్టంగానే ఉంటుంది. నిత్యం రద్దీగా ఉన్నట్లేయితే ఆ స్లాబుపై మరింత ఒత్తిడి పెరగనుంది. మరో వైపు నిర్మాణ సమయంలోనే పలు ఆటంకాలు వస్తున్నాయి. ఈనెల 17న ఉదయం స్లాబు వేసేందుకు అల్లిన స్టీల్‌పై రెడీమిక్స్ పోయగా వెంటనే కుప్పకూలింది. అప్పటికప్పుడు నీటితో సిమెంటును కడిగారు. ఆ సమయంలో ఆ స్టీల్ ఎక్కడికక్కడే ఊడిపోయి మురుగునీటి కాల్వలో పడిపోయింది. నాణ్యత పరంగా, సామర్థ్యం విషయంలో అధికారుల పరిశీలన అవసరం.

ఉన్నతాధికారులతో చర్చిస్తాం

వరదకాల్వపై స్లాబు, సమాంతరంగా రోడ్డు వేస్తుండగా ఆ వైపు వచ్చే వాహనాల లోడును బట్టి డిజైన్ చేశాం. అపోహలు రాకుండా ఉన్నతాధికారులతో చర్చించి ఆ వైపు సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తాం. ఏ వాహనాలు వెళ్లాలనే విషయాన్ని నిర్ణయిస్తాం.

ఇంజినీరింగ్ అధికారి, కరీంనగర్ నగరపాలిక స్లాబు సామర్థ్యం ఎంత?

బైపాసు రోడ్డు రెండు వరుసల రహదారిలా మారుతుండగా అందులో 20 ఫీట్ల వెడల్పుతో సుమారు రహదారి మొత్తంలో సగ భాగం వరద కాల్వ ఉంది. అడుగు భాగం, కాల్వ గోడలు, స్లాబు పూర్తిగా సలాక, కాంక్రీట్‌తోనే నిర్మిస్తున్నారు. బైపాసు రహదారి కావడంతో అటుగా టిప్పర్లు, లారీలు అధిక లోడుతో వెళ్లే అవకాశముంటుంది. ఒక టిప్పర్ కనీసం 30 టన్నుల లోడుతో వెళ్తోంది. అలాంటి సమయంలో దాని గుండా ప్రయాణిస్తే ఆ స్లాబు సామర్థ్యం ఉంటుందా? బరువు తగ్గట్లుగా ఉంటుందా అనేది అందరిలో వస్తున్న ప్రశ్న.

లోడుకు అనుకూలంగానే డిజైన్

వరదకాల్వపై స్లాబు వేసి రోడ్డు తరహాలో నిర్మించేందుకు వాహనాల లోడు పరిశీలించిన తర్వాతే డిజైన్ చేశారని ఇంజినీరింగ్ అధికారులు అంటున్నారు. అధిక బరువుతో వాహనాలు వెళ్లే విధంగా స్టీల్ డిజైన్ చేశారని చెబుతున్నారు. డిజైన్ కోసమే ఈ పనులు ఆలస్యమయ్యాయని, లేదంటే ఎప్పుడో పూర్తి చేసే వారని అంటున్నారు. ప్రస్తుతమున్న స్టీల్ స్ట్రాంగ్‌గా ఉందని, ఎంత బరువున్న ఆపుతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి వెడల్పు కోసం వరద కాల్వపై ఎనిమిది ఇంచుల స్లాబు వేస్తున్నారు. ఇలా స్వశక్తి కళాశాల ఎదురుగా కోతిరాంపూర్ ప్రధాన రహదారి సమీపం వరకు నిర్మాణ పనులు చేపట్టారు. మూడు, నాలుగు చోట్ల స్లాబు పూర్తయితే పనులు పూర్తయ్యినట్లే.

వరద కాల్వ నిర్మాణం పూర్తిగా సలాకతో సెంట్రింగ్ చేస్తున్నారు. పలు రకాల సైజులో సలాక అల్లి దానిపై కాంక్రీట్ పోస్తున్నారు. కింద బెడ్‌తో పాటు చుట్టూ గోడలు ఇలాగే నిర్మిస్తుండగా ఈనెల 17న ఉదయం స్లాబు వేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో సెంట్రింగ్ అడుగు భాగం పడిపోవడంతో సెంట్రింగ్ పూర్తిగా ఊడిపోయింది.

# నారసింహా.. పనులు సాగవా?



కరీంనగర్ : భక్తుల కోరికలు తీర్చే నారసింహ స్వామి సన్నిధిలోనే పనులు ముందుకు సాగడం లేదు.. బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అమలు ఒకడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కిలా ఉంది.. రెండేళ్ల కిందట రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా ఇక్కడికి వచ్చి ఏడాదిలోగా ఆలయ రూపురేఖలు మారిపోవాలని.. భక్తుల కొంగు బంగారమైన స్వామి సన్నిధిలో అభివృద్ధి జాడలే అడుగడుగునా కనిపించాలని ఆదేశాలిచ్చినా కొన్ని పనులు మాత్రమే అరకొరగా సాగుతున్నాయి..ధర్మపురి ఆలయాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేయాలనే ఆశయానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది. మొదటి దఫాలో 10 పనులను ఎంపిక చేసి వాటి కోసం రూ.46.65 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో రూ.6.50 కోట్లతో చేపట్టిన సత్రాల గదుల నిర్మాణాలు మాత్రమే తుది దశకు చేరాయి. మిగతా వాటికి సంబంధించి టెండర్లు కొన్నింటికి నిర్వహించగా.. గుత్తేదారులు ఆసక్తిని చూపించకపోవడం, ఇంకొన్ని టెండర్లను కొందరు దక్కించుకున్నా.. పనులు చేపట్టకపోవడం పురోగతికి అడ్డంకిగా మారాయి. ఒక్కో పని కోసం నాలుగైదుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. రెండో విడతలో ఎంచుకున్న పనులకు రూ.16.04 కోట్లు కేటాయించగా.. ఇందులో రూ.15 లక్షల పని మినహా మిగతావన్నింటికి టెండర్ల అవరోధాలే ఉన్నాయి. మూడో దఫాగా రూ.25 లక్షల పనులకు అనుమతి వచ్చింది. మొత్తంగా రూ.62.94 కోట్ల నిధులను ఖర్చు చేసే విషయంలో పురోగతి ఉండటం లేదు.

ప్రత్యేక చొరవ చూపితేనే..ఏళ్లుగా ఆలయం.. ఆలయ పరిసరాల్లో అభివృద్ధిని కళ్లారా చూడాలని ఆశిస్తున్న ధర్మపురి వాసులకు, ఇక్కడికి వచ్చే భక్తులకు నిరాశే ఎదురవుతోంది. భూసేకరణ ఇబ్బందులు ఉన్న పనులు ఆలస్యం చేసినా.. ఇతరత్రా ఎలాంటి అవాంతరాలు, అడ్డంకులు లేని వాటి విషయంలో పాలకవర్గం సహా దేవాదాయశాఖ, జిల్లా పాలనాధికారి ప్రత్యేక చొరవను తీసుకోవాల్సిన అవసరముంది. ఆలయ అభివృద్ధి పనుల విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి.. పరుగులు పెట్టిస్తేనే పనులు వేగంగా సాగే అవకాశముంది. ప్రజాప్రతినిధులు, అధికారులు తరచుగా వస్తూ స్వామివారిని దర్శించుకుంటున్నా.. అభివృద్ధి పనుల పురోగతిపై మాత్రం దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రాజగోపురం సహా ప్రధానాలయాల పునర్నిర్మాణాలు, స్వాగత తోరణాల నిర్మాణాలు, అనుబంధ ఆలయాల పునర్నిర్మాణాల పనులు జరిగితే బృహత్తర ప్రణాళికలో సగం వరకు పనులు పూర్తయినట్లు ఉండేది. కాని పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. పనుల విషయమై ఆలయ ఈవో ఎస్.శ్రీనివాస్‌తో మాట్లాడగా పనులపై పర్యవేక్షణను పెంచుతామని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మరోసారి అవసరమైన పనులకు టెండర్లను పిలుస్తామని, పనులు వేగంగా జరిగేలా చూస్తామన్నారు.

# అటకెక్కిన ఆన్‌లైన్..!



సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో పురపాలిక ఆదాయానికి గండిపడుతోంది. ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో దాదాపు 29,876 దుకాణాలు ఉన్నాయి. వీటిలో 14,187 దుకాణాలను మాత్రమే అధికారులు ఆన్‌లైన్ చేశారు. ఏటా బల్దియాలకు రూ.కోట్ల ఆదాయం సమకూరాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో భారీగా గండిపడుతోంది.

పెరుగుతున్న దుకాణాలు..

ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల విస్తీర్ణంతో పాటు దుకాణాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఒకప్పుడు రహదారులు, ప్రధాన కేంద్రాలకే పరిమితమైన వ్యాపార సంస్థలు, దుకాణాలు, హోటళ్లు, ఫలహారశాలలు కాలనీల్లోనూ అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో ఆ స్థాయిలో ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, కనీస అవసరాలు కల్పించాల్సిన బాధ్యత పురపాలికపై పడింది. ఈ భారాన్ని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, వస్త్ర దుకాణాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మెకానిక్, వండ్రంగి, వెల్డింగ్, ఎంటర్‌ప్రైజెస్, రైస్‌మిల్లులు, పూల దుకాణాలు, తదితర వ్యాపార సంస్థల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది. వాటిని గుర్తించి ఆన్‌లైన్ చేయడం ద్వారా పన్ను వసూలు చేసి పురపాలికకు ఆదాయాన్ని సమకూర్చాల్సి ఉంది. ఈ విషయంలో అధికారులు అవసరమైన మేర చొరవ చూపటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పురపాలికల్లో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. పూర్తి స్థాయిలో దుకాణాలను ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు.

# 59 వేల ఎకరాల్లో పంట నష్టం

జగిత్యాల : మండుటెండల సమయంలో రోజుల తరబడి అకాల వర్షాలు కురుస్తూ అన్నదాతలను కుదురుకోనీయకుండా చేస్తున్నాయి. అన్నిరకాల పంటలు చేతికందే తరుణంలో వర్షం, ఈదురు గాలులు, వడగళ్లు విరుచుకుపడి జిల్లా రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తుండగా ధాన్యం సేకరణలో జాప్యం అన్నదాతలను మరింతగా వేధిస్తోంది. అకాల వర్షాలు వెన్నాడుతున్న తరుణంలో ధాన్యం సేకరణలో జాప్యం చాలా గ్రామాల రైతుల పాలిట శాపంగా మారింది. నిరుటికన్నా ఈ యాసంగిలో దాదాపుగా 15 రోజుల ముందుగానే జిల్లాలో ఏప్రిల్ మొదటివారంలోనే వరి నూర్పిడులు ఆరంభమయ్యాయి. ఇప్పటికీ ఆశించినట్లుగా సేకరణ జరగటంలేదు. ధాన్యం దిగుబడి, వరి నూర్పిడులను బట్టి కేంద్రాలను తెరవాల్సి ఉండగా కొన్నిచోట్ల నేతలకోసం ప్రారంభాన్ని వాయిదావేశారు. మరికొన్నిచోట్ల కేంద్రాలను ప్రారంభించిన తరువాత మిల్లుల కేటాయింపు, బస్తాల తరలింపును లారీల గుత్తేదారులకు అప్పగించటం, హమాలీలను కేటాయించటం, గన్నీలను తరలించటం తదితర పనులను చాలా నిదానంగా మొదలుపెట్టారు. వరి నూర్పిడులు ఆరంభమైన వెంటనే సేకరణ ప్రారంభిస్తే ఇప్పటికే చాలాగ్రామాల్లో పెద్దఎత్తున ధాన్యం మిల్లులకు తరలేది. కాగా సేకరణలో జాప్యం వేలాదిమంది రైతులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తోంది. కేంద్రాలన్నీ మట్టి కళ్లాలు కావటం, టార్పాలిన్లు తగినన్ని లేకపోవటం నష్టతీవ్రతను మరింతగా పెంచింది. ఇదే తరుణంలో మార్క్‌ఫెడ్ మొక్కజొన్నల సేకరణను ప్రారంభించకపోవటంతో మక్కలు సైతం వర్షాలకు తడుస్తుండగా పసుపు, కందులు తదితర ఉత్పత్తులు కూడా వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి.

జిల్లాలో నూర్పిడి చేయాల్సిన పంటల్లో అకాలవర్షాలతో నష్టతీవ్రత



రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలోని 19 మండలాల్లోని 32,444 మంది రైతులకు చెందిన వరి, మక్క, నువ్వు, సజ్జ, మామిడి పంటలు 59,794.4 ఎకరాల్లో దెబ్బతిన్నాయని డీఏవో పి.సురేశ్‌కుమార్ తెలిపారు. ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి పంపించామని, రైతువారీగా సర్వేచేసి తుది నివేదికను పంపిస్తున్నామన్నారు. మామిడి కాయలు రాలటం, మార్కెట్లో అతి తక్కువగా ధర పలకటంతో జిల్లాలో మామిడికి రూ.90 కోట్లవరకు నష్టం వాటిల్లగా ఇతర పంటల్లోనూ మరో రూ.100 కోట్లకుపైగా పంటలను కోల్పోయారు. ప్రభుత్వం పంటలను కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని పేర్కొన్నా ఎందరికి మంజూరు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. పంట నష్టపోయిన మేరకు పరిహారం ఇవ్వాలని, ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని, మక్కల కొనుగోలును ప్రారంభించాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

ఏర్పాటు తలపెట్టిన కేంద్రాలు 419
ఇప్పటి వరకు ప్రారంభించినవి 360
కొనుగోలు ప్రారంభించినవి 25
వరిసాగు విస్తీర్ణం 2.98 లక్షల ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా 5.32 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం 20వేల క్వింటాళ్ల వరకు

# ఎక్కడి నిర్మాణాలు అక్కడే!

కరీంనగర్ : ఎండాకాలంలో వర్షం దంచి కొడుతుండటంతో లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో వర్షం వస్తే చాలు.. కాలనీలు జలమయమవుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద ఉధృతికి కాల్వలు నిండి రోడ్లపైకి రావడం.. ఇళ్లల్లోకి వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు స్మార్ట్‌సిటీలో ప్రాధాన్యమిచ్చి నిధులు కేటాయించారు. గతేడాది ఏప్రిల్‌లో పనులను ప్రారంభించగా వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. ఆలోగానే వర్షాలు పడుతుండటంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వానలు విరామం ఇవ్వగానే పనులు త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇటీవల కురిసిన వానతో బయటపడిన కొన్ని లోపాలతో కథనం.ప్రణాళిక ప్రకారం పూర్తి చేయకపోవడంతో..

గతంలో ఎక్కడైతే వరద రోడ్డెక్కిందో అక్కడే మళ్లీ రహదారులు నదులను తలపించాయి. ముకరంపుర, కలెక్టరేట్ రహదారి, జ్యోతినగర్‌లోని శివ థియేటర్ ఎస్‌బీఐ ఎదురుగా, కొత్త లేబర్ అడ్డా నుంచి సంతోషిమాత గుడి వైపు, మంకమ్మతోట హెచ్‌పీ పెట్రోల్‌బంకు ఎదురుగా, రాంనగర్ బస్టాపు సమీపంలో, కోతిరాంపూర్ ప్రధాన రహదారి, విద్యానగర్, శ్రీనగర్‌కాలనీ మాచర్ల గార్డెన్ దగ్గర, మంచిర్యాల చౌరస్తాలో, శర్మనగర్‌లో, అమేర్‌నగర్, హుస్సేనీపుర, అశోక్‌నగర్, కట్టరాంపూర్, తిరుమల్‌నగర్, కమాన్ ప్రాంతాల్లో ఎప్పటిలాగే వరద ప్రవహించింది. స్మార్ట్‌సిటీలో వరద కాల్వల పనులను పూర్తి చేయకపోవడంతో అక్కడి నుంచే వరద రోడ్ల మీదకు చేరింది. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయకపోవడంతో సమస్యలు తప్పడం లేదు. కొన్ని చోట్ల ఇప్పటికీ పనులు ప్రారంభించకుండా వదిలేశారు. వర్షాకాలంలోగా సమస్యలు లేకుండా పూర్తి చేయాల్సిన అవసరముంది. లేదంటే ముంపు ముప్పు పునరావృతం కాక తప్పదు. ప్రభుత్వాసుపత్రి ఎదురుగా శర్మనగర్ మీదుగా ప్రవహించే వరద కాలువ పలు చోట్ల శిథిలమైంది. ఆదివారం కురిసిన వర్షానికి నీటి ప్రవాహం అధికమై ఖాళీ స్థలంలోకి వచ్చి వీధులన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద చేరి స్థానికులు అవస్థలు పడ్డారు. హుస్సేనీపురలో ప్రధాన రహదారి పక్క నుంచి వెళ్లే వరద కాల్వ వర్షం పడితే చాలు పొంగి పొర్లుతుంది. స్మార్ట్‌సిటీలో నిర్మిస్తామని చెప్పి ప్రణాళికలు చేయగా ఇప్పటికీ అతీగతి లేకపోగా ఆ నీరంతా ఇళ్లల్లోకి వస్తోంది. సప్తగిరికాలనీ, శ్రీనగర్‌కాలనీ పూర్తిగా నీట మునిగింది. ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్ వైపు మీదుగా డ్రైనేజీ నిర్మించకపోవడంతో నీరంతా వెనక్కి వచ్చి రోడ్లపై పారుతుంది. ఈ వైపు పలు చోట్ల అసంపూర్తి కాల్వలు ఉన్నాయి. హౌసింగ్‌బోర్డుకాలనీలో ఎల్ఐజీ క్వార్టర్స్ వైపు బైపాసు రోడ్డు మీదుగా వరద ప్రవహించాల్సి ఉండగా హనుమాన్ గుడ్డి దగ్గర పనులు నిలిచి పోయాయి. భారీ వర్షం పడితే చాలు నీరంతా ఈ క్వార్టర్స్ వైపు ఉన్న నాలుగైదు ఇళు నీట మునుగుతున్నాయి.

పాతికేళ్ల నుంచి సమస్య..

శర్మనగర్‌లోని వరదకాల్వ పూర్తిగా కూలింది. పాతికేళ్ల నుంచి వరద వస్తూనే ఉంది. మరమ్మతులు చేయాలని పలుమార్లు వినతులు చేసినా పట్టించుకోవడం లేదు. వర్షానికి నీరంతా ఇళ్లలోకి వచ్చింది. బురద పేరుకుపోయింది.

# మావోయిస్టుల కదలికలపై నిఘా

ములుగు : మావోయిస్టు కదలికలపై డేగకన్ను వేయాలని రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజీ ప్రభాకర్‌రావు ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన వెంకటాపురం పోలీస్ సర్కిల్ కేంద్రంలో ఆయన రహస్యంగా పర్యటించారు. ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నక్సల్స్ కదలికలపై ఆరా తీసినట్లు సమాచారం. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం అనంతరం ఇక్కడ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కీలకమైన ఈ ప్రాంతంలో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

రెండు జిల్లాల అధికారులతో సమీక్ష

భౌగోళికంగా మావోయిస్టుల కదలికలు, రాకపోకలకు అనుకూలంగా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ సర్కిల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్ సర్కిల్ పరిధిలోని దండకారణ్యంపై నిశిత శోధన చేపట్టాలని ఉన్నత స్థాయి అధికారులు సూచించినట్లు తెలిసింది. ములుగు ఎస్పీ గాష్ ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్‌లతో పాటు సీఆర్పీఎఫ్, ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో ఇక్కడ రహస్య సమావేశం అయ్యారు. తనిఖీలు నిర్వహించి తిరుగుముఖం పట్టిన జవాన్లను మావోయిస్టులు మట్టుబెట్టిన



తీరు, దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత క్రమంలో తీసుకోవాల్సిన రక్షణ, భద్రత చర్యలపై కీలకాంశాలను చర్చించినట్లు తెలుస్తోంది. కట్టుదిట్టమైన భద్రతతో శత్రువును తుదముట్టించేందుకు ప్రణాళికలు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

దండకారణ్యంలోకి అడుగు పెట్టకుండా..

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని అక్కడి సీఆర్పీఎఫ్, డీఆర్జీ, ఏఎస్టీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ బృందాలు జల్లెడ పడుతున్న క్రమంలో మావోయిస్టులు తెలంగాణ అరణ్యంలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు ఉన్నత స్థాయి సమీక్షలో పోలీసు అధికారులు ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడ కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో దండకారణ్యంలోకి మావోయిస్టులు అడుగులు పెట్టకుండా కట్టుదిట్టమైన నిఘాను పెంచాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మావోయిస్టులు ఏ ప్రాంతానికి వచ్చినా ఎదుర్కొనేలా సంసిద్ధం కావాలని సూచించినట్లు తెలిసింది.

అంతా గోప్యంగానే..

శాంతిభద్రతల పరిరక్షణకు గాను చేపట్టిన ఉన్నత స్థాయి సమీక్షను పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచారు. ఎవరు పర్యటించారు? సమీక్షకు సంబంధించిన విషయాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. డ్రోన్ ఆపరేషన్ ప్రాంతానికి వెళ్లేందుకు మీడియా ప్రయత్నించినా పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం, పర్యటనకు సంబంధించి కనీస ప్రకటన సైతం జారీ చేయకపోవడం గమనార్హం. డ్రోన్‌తో అన్వేషణఉన్నతస్థాయి సమీక్ష నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా నిఘా పెంచారు. వెంకటాపురం-వాజేడు మార్గంలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. సీఆర్పీఎఫ్, ప్రత్యేక పోలీసు బలగాలతో గస్తీ తిరిగారు. పట్టణ శివారులోని ఓ మైదాన ప్రాంతంలో డ్రోన్ ఆపరేషన్ చేపట్టారు. సాంకేతికత సాయంతో సరిహద్దు దండకారణ్యంలో సర్వే చేశారు. మావోయిస్టుల కదలికలు ఉండే గుట్టల ప్రాంతాన్ని డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఆయా చిత్రాలను సైతం సమీక్ష సమావేశంలో ప్రదర్శించి చర్చించినట్లు తెలుస్తోంది.

# తడిసిన ధాన్యం.. ఉప్పుతో ఉపకారం!

ములుగు : ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ముమ్మరమై.. కొనుగోలు కేంద్రాలు ధాన్యంతో పోటెత్తుతున్న సమయంలోనే అకాల వర్షాలు అడ్డుపడ్డాయి. కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దవ్వడం.. పొల్లాలోని వరి నేలవాలడంతో కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ధాన్యం మొలకెత్తకుండా పలు విధాలా ప్రయత్నిస్తున్నారు. తడిసిన వడ్లు రంగు మారకుండా, మొలకలు రాకుండా 'ఉప్పు' ఉపకారిగా పనిచేస్తుందని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వారి సూచనలను పాటిస్తూ.. ధైర్యంగా ఉందాం..ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా యాసంగిలో సాగైన వరి: 6,48,090 ఎకరాలు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 70 శాతం, మహబూబా బాద్ 45, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 50 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. జనగామ జిల్లాలో వడగళ్లతో చాలా చోట్ల పంట చేతికిరాకుండా నేలరాలింది. ఇక్కడ 30 శాతం కోతలే పూర్తయ్యాయి.

ఊహించని నష్టం...వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మార్చి నుంచి ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో 1.20 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కురిసిన వాన వల్ల 15 లక్షల క్వింటాళ్ల ధాన్యం కల్లాల్లో తడిసి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. నీళ్లలో కొట్టుకుపోయింది ఎక్కువగానే ఉంది. వాటికి లెక్కలు లేవు. ఆరు జిల్లాల్లో లక్ష ఎకరాలకు పైగా పొలాల్లో ధాన్యం నేలరాలింది.

ఈ జాగ్రత్తలు తీసుకుందాం.. కుప్పలుగా పోసిన ధాన్యాన్ని పలుచగా నేలపై చల్లినట్లు ఆరబోయాలి. ఎప్పటికప్పుడు కలియదిప్పడంతో పాటు గాలి అందేలా చూడాలి. తడిసినవి, రంగుమారిన గింజలను మంచి ధాన్యంతో కలపకూడదు. వేర్వేరుగా ఉంచితే ఎక్కువ నష్టం జరగదు. తడవకుండా ఉండేందుకు కుప్పను ప్రత్యేకమైన పద్ధతిలో కాపాడేలా టార్పాలిన్లు కప్పాలి. వరద పక్కనుంచి వెళ్లేలా పాదులు తీయాలి.

మార్చిలో కోతకు వచ్చేలా..యాసంగి వరి సాగు చేసేవారు మార్చిలో కోతకు వచ్చేలా నాట్లు వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జనవరి 26 వరకు నాట్లు వేస్తే సరిపోతుంది. చాలా మంది ఫిబ్రవరి మొదటి వారంలో నాట్లు వేయడం వల్ల కోతలు అనుకున్న సమయానికి రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అకాల వర్షాలు తోడుకావడంతో అన్నదాతలు నష్టపోయారు.వర్షపాతం ఇలా.... గతేడాది (2022) జూన్ 1 నుంచి ఈ ఏడాది మే 2వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,002.5 మి.మీల సగటు వర్షపాతం నమోదు కావాలి. 1,585.83 మిల్లీమీటర్లు కురిసింది.

# ఏమరుపాటు.. ప్రాణాలకు చేటు



ఖమ్మం :విద్యుత్తు తీగ మృత్యుపాశమవుతోంది. క్షణకాల నిర్లక్ష్యంతో ఎంతోమంది ప్రాణాలు బలిగొంటోంది. మరెందరో వైకల్యం బారిన పడుతున్నారు. తెగి పడిన తీగలు, పంటలను కాపాడేందుకు పెట్టే రక్షణ కంచెలు, వ్యవసాయ విద్యుత్తు మోటార్లు, నియంత్రికల ఎర్తులు వంటివి ఉసురు తీస్తున్నాయి. అకాల వర్షాల కారణంగా జిల్లాలో ఇటీవల పలు సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్తు ప్రమాదాలపై సిబ్బందిని, ప్రజలను చైతన్య పరిచేందుకు విద్యుత్తు శాఖ ఏటా మే ఒకటి నుంచి వారం రోజులపాటు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 11 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 1.6 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. జోరుగా గాలి వీచినప్పుడు, వర్షాకాలంలో తీగలు తెగడం, పంటకు రక్షణగా కంచెకు విద్యుత్తు పెట్టడం, జంతువులను, చేపలను వేటాడేందుకు ఏర్పాటు చేసిన తీగలు తగలినప్పుడు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఉప కేంద్రాల్లో అరకొరగా సిబ్బంది ఉండటంతో వేలాడే, తెగిన విద్యుత్తు తీగలను గుర్తించడం ఆలస్యమవుతోంది.పరిహారం పొందొచ్చు...విద్యుత్తు ప్రమాదాలతో మృతి చెందిన కుటుంబాలకు సంస్థ పరిహారం అందిస్తుంది. అయితే ఘటన ఆ శాఖ నిర్లక్ష్యం వల్ల జరిగిందని తేలితేనే పరిహారం మంజూరవుతుంది. వ్యక్తి మృతి చెందితే రూ.5 లక్షలు, పశువులకు రూ.40 వేలు, గొర్రెలు, మేకలకు కూడా పరిహారం అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు స్టేషన్‌లో, విద్యుత్తు శాఖ అధికారులకు తెలియజేయాలి. ఎఫ్ఐఆర్, పంచనామా ధ్రువీకరణ పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలి.

జాగ్రత్తలు... విద్యుత్తు సరఫరా చేసే పరికరాలను అమర్చుకోవడంలో నిర్లక్ష్యం వహించకూడదు. ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులు ఏర్పాటు చేసుకోవాలి. ఎర్తింగ్ తప్పనిసరి.

వర్షాలు పడినప్పుడు తెగిపడిన విద్యుత్తు తీగలు, విరిగిన స్తంభాలను ముట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలి.

వేలాడుతున్న తీగల గురించి అధికారులకు తెలియజేయాలి.

అనుమతి లేకుండా నియంత్రికల పైకి ఎక్కి తీగలు సరి చేయడం, మరమ్మతు చేయడం, సర్వీసు వైర్లు మార్చకూడదు.

వ్యవసాయ పంపుసెట్ల వద్ద సర్వీసు, ఎర్త్ వైర్లు మంచి నాణ్యమైన ఇన్సులేషన్ ఉన్నవి వినియోగించాలి. పొలం కంచెకు స్టే వైర్లు, ఎర్త్ వైర్లు తగలకుండా చూసుకోవాలి.

ఫ్యూజులు, స్టార్టర్ బోర్డులు నేలకు 5 అడుగుల ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేయాలి.

ఫ్యూజు కాలిపోతే నేరుగా కనెక్షను ఇవ్వకూడదు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొత్త ఫ్యూజు అమర్చుకోవాలి.

దుస్తులు ఆరేసేందుకు ఉపయోగించే దండెంగా తాడును, ఇన్సులేషన్ ఉన్న తీగను ఉపయోగించాలి. విద్యుత్తు తీగలకు దగ్గరగా కట్టకూడదు.

ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే రక్షించాలనే ఆతృతతో ముట్టుకోవద్దు. విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలి.

పంట పొలాల రక్షణ కంచెలకు విద్యుత్తు కనెక్షను ఇవ్వవద్దు. సోలార్ ఫెన్సింగ్ ఉపయోగించుకోవచ్చు.

ఏడాది కాలంలో జరిగిన ప్రమాదాలు

ఖమ్మంలో.... 30 మంది వ్యక్తులు, 153 పశువులు

భద్రాద్రి కొత్తగూడెంలో...32 మంది వ్యక్తులు, 102 పశువులు మృత్యువాత పడ్డాయి. మరెందరో గాయాలపాలయ్యారు.

మధిరలో వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో కొణతం రామచంద్రరావు(59), కంభం అనిల్(21) మృతి చెందారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నివారణ

నిర్లక్ష్యం, అవగాహన లేమితోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజలను, రైతులను చైతన్య పరిచేందుకు ఏటా మే మొదటి వారంలో భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించి, ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఏదైనా ఘటనను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలి.

ఎ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం

సమాచారం ఇద్దాం... తెగిన, వేలాడే విద్యుత్తు తీగలు, ప్రమాదాలు గుర్తించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబరు: 1800 425 0028, హెల్ప్‌లైన్ 1912కు సమాచారం అందించాలి.

# సర్ఫేస్ మైనర్...కార్మికులకు శాపమా?



మణుగూరు : సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిలో పూర్తిగా యాంత్రీకరణ వైపు మళ్లుతోంది. కార్మికుల అవసరం లేకుండానే బొగ్గు ఉత్పత్తి చేపట్టే యంత్రాలను ప్రవేశ పెడుతోంది. మణుగూరులోని ఓసీ 4 గనిలో 2022లో ఇటీవల సర్ఫేస్ మైనర్ యంత్రాన్ని సింగరేణి ప్రవేశపెట్టింది. సర్ఫేస్ మైనర్ యంత్రం కార్మికుల అవసరం లేకుండా బొగ్గు ఉత్పత్తి చేపడుతుంది. పూర్తిగా బొగ్గు ఉత్పత్తి చేపట్టే ఈ యంత్రం ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. మణుగూరు ఏరియాలో ఓసీ 4, ఓసీ 2, మణుగూరు ఓసీ, కొండాపురం భూగర్భ గనులు ఉన్నాయి. అన్ని గనుల్లో దాదాపుగా ప్రైవేటు కంపెనీలే ఓబీ, బొగ్గు వెలికితీత పనులు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు కార్మికులతో పని లేకుండా బొగ్గు ఉత్పత్తి చేసే సర్ఫేస్ మైనర్ యంత్రం ప్రవేశ పెట్టడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు సర్ఫేస్ మైనర్ యంత్రాన్ని సింగరేణి ఆధ్వర్యంలో కొనసాగించాలని కోరుతూ కార్మిక సంఘాలు ధర్నాలు, నిరసనలు చేపట్టాయి. 2003లో కోయగూడెంలో మొదటిసారిగా సర్ఫేస్ మైనర్‌ని ప్రవేశ పెట్టినప్పుడు కార్మిక 13 రోజులు కార్మికులు సమ్మె చేశారు.

యంత్రం ప్రత్యేకత

సర్ఫేస్ మైనర్ యంత్రం రూ.8 కోట్లతో ప్రైవేటు ఓబీ కంపెనీ తీసుకొచ్చింది. బొగ్గు గనిలో హెచ్ 3, హెచ్ 4, థిక్ సీమ్స్ కలిగిన బొగ్గు పొరలు ఉంటాయి. ఈ మూడు పొరలు బొగ్గుతో కలిసే ఉంటాయి. బ్లాస్టింగ్ చేసి బొగ్గుని వెలికితీయటంతో మంచి బొగ్గు, నాణ్యత కలిగిన బొగ్గు ఒకేసారి వస్తాయి. కానీ సర్ఫేస్ మైనర్ యంత్రం 30 సెంటీమీటర్ల లోతు, 4 మీటర్ల వెడల్పుతో బొగ్గు పొరలను తొలిగిస్తుంది. వెలికితీసిన బొగ్గుని లాడర్ సాయంతో గ్రేడ్‌ల వారీగా వేరు చేయటం సులువు. అంతేకాకుండా నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అవుతుంది. దీంతో మంచి నాణ్యత కలిగిన బొగ్గు ఎక్కువగా వస్తుంది. దీంతో సింగరేణి సంస్థ భవిష్యత్తులో సింగరేణి వ్యాప్తంగా అన్ని గనుల్లో సర్ఫేస్ మైనర్ యంత్రాలను ప్రవేశ పెట్టాలని భావిస్తుంది.

కార్మిక సంఘాల వాదన ఇలా..ర్ఫేస్ మైనర్ ఏర్పాటుతో కార్మికుల భవిష్యత్తు అంధకారంలో పడుతుందని కార్మిక సంఘాలు వాదిస్తున్నాయి. కానీ యాజమాన్యం మాత్రం కార్మికులెవరినీ బదిలీ చేయలేదని, తొలగించలేదని వాదిస్తోంది. సర్ఫేస్ మైనర్ ఏర్పాటుతో డంపర్, షావెల్ ఆపరేటర్లు, కేబుల్‌మెన్, సూపర్‌వైజర్లుకి పని ఉండదు. సర్ఫేస్ మైనర్ యంత్రంలో బొగ్గు ఉత్పత్తి చేయటంతో అధిక మొత్తంలో దుమ్ము, దూళీ వెలువడుతుంది. వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. భవిష్యత్తులో యువ కార్మికుల నియామకం తగ్గనుంది. సర్ఫేస్ మైనర్ యంత్రంతో బొగ్గు ఉత్పత్తి చేసినా సింగరేణినే రవాణా జరపాలి.

సింగరేణినే యంత్రాలు నడపాలి

– ప్రభాకర్‌రావు, తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షులు

బొగ్గు గనుల్లో యంత్రాలను ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో కాకుండా, సింగరేణినే ఉద్యోగులతోనే యంత్రాలను నడపాలి. ఉత్పత్తి, ఉత్పాదకత కోసం ప్రైవేటీకరణ చేపడుతున్నారు. దానిని వ్యతిరేకిస్తున్నాం. ప్రైవేటు యంత్రాలతో ఉద్యోగులకు ప్రమాదం పొంచి ఉంది.

శాశ్వత ఉద్యోగులకు హాని ఉంటుంది– రాంగోపాల్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి

సర్ఫేస్ మైనర్‌తో శాశ్వత ఉద్యోగులకు హాని ఉంటుంది. ఓసీ 2లో ఇటీవల ప్రైవేటు డ్రిల్‌ని తీసుకొచ్చారు. భవిష్యత్తులో సర్ఫేస్ మైనర్‌ని తీసుకురానున్నారు. మణుగూరులో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించి, లాభాలు వస్తున్నా ప్రైవేటు యంత్రాలపై యాజమాన్యం మొగ్గు చూపుతోంది. ఈ విధానం విడనాడాలి.

# భూసార పరీక్షలేవీ?

మెట్‌పల్లి : నేల స్వభావం, ఎలాంటి పంటలు సాగు చేయాలి.. ఎరువులు ఎంత మోతాదులో వేయాలన్నది తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. ఫలితాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం చేపడితే తెగుళ్ల నివారణతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. భూసార పరీక్షల ఆధారంగా రైతులతో పంటలు సాగు చేయించాలన్న ఉద్దేశంతో గతంలో ప్రభుత్వం క్లస్టర్‌కో మినీ భూసార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కొన్ని రోజులు పరీక్షలు చేసినా ఆ తర్వాత రసాయనాలు రాక ప్రస్తుతం పరీక్ష కిట్లు మూలకు చేరాయి. భూమిలో ఉన్న పోషకాలు తెలియక ఇష్టానుసారంగా ఎరువులు వినియోగించడం వల్ల పెట్టుబడి పెరగడంతో పాటు దిగుబడులపై ప్రభావం చూపుతోంది. భూసార పరీక్షలు చేసి రైతులకు తగు సూచనలు అందజేయడానికి ప్రభుత్వం క్లస్టర్‌కు ఒక్కటి చొప్పున భూసార మినీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మొత్తం 11 రకాల పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. పరీక్షలు చేయడానికి కిట్లను పంపిణీ చేయడంతో పాటు ఏఈవోలకు శిక్షణ ఇచ్చారు. మట్టిని విశ్లేషించి ఆమ్లక్షారం, ఆర్గానిక్ కార్బన్, స్థూల పోషకాలైన నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం, సల్ఫర్, సూక్ష్మ పోషకాలైన కాపర్, జింక్, మాంగనిస్, ఐరన్, బోరాన్ తదితర పోషకాల శాతాన్ని తెలుసుకోవాల్సి ఉంటుంది. ఫలితాలను బట్టి పంటల సాగు, ఎరువులు వినియోగించడం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగి ఆర్థికంగా లాభం చేకూరుతుంది. మినీ కేంద్రాలను అప్పట్లో పంచాయతీ కార్యాలయాల గదుల్లో ఏర్పాటు చేశారు. మట్టి పరీక్షలు చేసేందుకు విద్యుత్, నీటి సౌకర్యం తప్పనిసరి. మొదట్లో సరైన సౌకర్యాలు లేక భూసార పరీక్షలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

రసాయనాలు లేక..ప్రస్తుతం క్లస్టర్‌కు రైతు వేదిక నిర్మించారు. రైతు వేదికల్లో పరీక్షలు చేసే వీలున్నా రసాయనాలు లేక భూసార పరీక్షలు ముందుకు సాగడం లేదు. మట్టి పరీక్షలు చేయడానికి పంపిణీ చేసిన పరీక్ష కిట్లు వృథాగా మారాయి. పరీక్షల నిమిత్తం పీహెచ్ మీటర్లు, తూకం వేసే యంత్రం, టెస్ట్‌ట్యూబ్‌లు, రసాయనాలు, ఇతర పరికరాలు పంపిణీ చేశారు. కొద్ది రోజులు పరీక్షలు జరిగాయి. ఆ తర్వాత పరీక్షలకు అవసరమైన రసాయనాలు సరఫరా కాలేదు. దీంతో పరీక్షలు జరగక మినీ భూసార కిట్లు మూలకు చేరాయి. దీంతో ఆశించిన ఫలితం నెరవేరడం లేదు. మట్టి పరీక్షలు చేయించుకునే రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఏఈవోలకు లక్ష్యాలు విధించి మట్టి నమూనాలు సేకరించి పంపుతున్నా సకాలంలో ఫలితాలు అందడం లేదు. ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో మినీ భూసార కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి మట్టి పరీక్షలు నిర్వహిస్తే రైతులకు మేలు చేకూరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# చెత్తశుద్ధి... ఆదాయ వృద్ధి

ఖమ్మం : జిల్లా కేంద్రంలోని దానవాయిగూడెం డంపింగ్ యార్డులో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన చెత్త సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. ఏప్రిల్ 11న బయో మైనింగ్ ప్రక్రియ ప్రారంభం కావడం, ప్రస్తుతం రెండు యంత్రాలు పని చేస్తుండటంతో ఇప్పటివరకు 150 మెట్రిక్ టన్నుల ఎరువు అక్కడ సిద్ధమయ్యింది. దానవాయిగూడెంలోని 38 ఎకరాల సువిశాల స్థలంలో నగరపాలక సంస్థ నుంచి ఉత్పత్తయ్యే చెత్తను తరలిస్తున్నారు. గతంలో వేసవిలో, సాధారణ సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టడంతో తీవ్ర స్థాయిలో పొగ వచ్చి ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఇప్పుడు పరిస్థితి మారింది. బయో మైనింగ్ ప్రక్రియ జోరందుకోవడంతో ఉత్పత్తయిన ఎరువును రసాయన పరీక్షల నిమిత్తం పంపారు. అక్కడి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఎరువును



ఏవిధంగా వినియోగించుకోవచ్చో తెలుస్తుంది. నగరపాలికకు ఆదాయమూ పెరుగుతుంది.

రోజుకు 70 టన్నుల చెత్త శుద్ధి

ప్రస్తుతం ఏర్పాటు చేసిన రెండు యంత్రాల ద్వారా రోజుకు 70 నుంచి 75 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం నగరపాలకంలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించడంతోపాటు పొడి చెత్తపై ట్రిబుల్ ఆర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. పొడిచెత్తను ఐదు దశల్లో వడబోసిన అనంతరం వచ్చిన మట్టిని ఎరువుగా నగరపాలకంలో డివైడర్లలోని మొక్కలు, ఉద్యానవనాల్లోని మొక్కలకు వినియోగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇతర వ్యర్థాలను సిమెంటు ఫ్యాక్టరీలు, ఇటుకల తయారీ కేంద్రాలకు అమ్ముకునే వెసులుబాటు దొరుకుతుందని తెలిపారు. ప్రస్తుతం సుమారు ఐదెకరాల స్థలం వరకు ఉన్న చెత్త కుప్పలు తొలగిపోవడంతో ఆ ప్రాంతమంతా శుభ్రంగా కనిపిస్తోంది.

# జీసీసీలో లెక్కలేనితనం!

ఖమ్మం : 2022 జులై కంటే ముందు పనిచేసిన గోదాము ఇన్‌ఛార్జి అనారోగ్యంతో మరణించారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో ఎం.వెంకటేశ్వర్లు ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్నారు. స్టాక్, రిజిస్టర్ వివరాలకు రూ.30 లక్షల వ్యత్యాసం ఉండటంతో అతడిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. ఆ తర్వాత ఇన్‌ఛార్జిగా సంజీవరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన పనిచేసిన సమయంలోనూ రూ.3.22 లక్షల మేర లావాదేవీలు వ్యత్యాసం రావడంతో విధుల్లోంచి పక్కనపెట్టారు. ములకలపల్లి మండలంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో 2018-22 కాలానికి సంబంధించి సుమారు రూ.70 లక్షలు దుర్వినియోగమైనట్లు తేలింది. అధికారులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముష్టిగింజల విషయంలో కె.కృష్ణయ్య అనే ఉద్యోగి రూ.79 లక్షల దుర్వినియోగానికి పాల్పడ్డారని రెండేళ్ల క్రితం సస్పెండ్ చేశారు. పాల్వంచ జీసీసీలో భద్రపరిచిన కొన్ని క్వింటాళ్ల సరకు మాయమైనట్లు అప్పట్లో స్థానిక ఠాణాలో కేసు నమోదైంది.గిరిజన సహకార సంస్థలో నిధులు గోల్‌మాల్ అవుతున్నాయి. పర్యవసానం గా మూడు నెలలకు ఒకరు చొప్పున ఇద్దరు ఉద్యోగులు సస్పెండ్‌కు గురయ్యారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే వాదన వినిపిస్తోంది. రికార్డులు, నిల్వలకు పొంతన కుదరటం లేదు. ఆడిట్‌లో ఎడతెగని జాప్యం అవినీతికి



కారణమవుతోంది.

పాల్వంచ జీసీసీ పరిధిలో..

85 చౌక దుకాణాలు, 28 వసతి, ఆశ్రమ పాఠశాలలున్నాయి. పాల్వంచ, బూర్గంపాడు, ములకలపల్లి మండలాల్లోని వసతిగృహాలు, చౌకదుకాణాలకు జీసీసీ నుంచి సరకుల పంపిణీ జరుగుతోంది. నిత్యావసరాల ద్వారా ఏడాదికి రూ.30 కోట్ల మేర వ్యాపారం సాగుతోంది. చౌక దుకాణాలు, వసతిగృహాలకు ఏడాదికి 1,02,000 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా లావాదేవీలపై సకాలంలో ఆడిట్ జరగడం లేదు. 2019-2023 (మార్చి) మధ్య సుమారు రూ.100 కోట్ల లావాదేవీలు సాగినట్లు అంచనా. నిబంధనల ప్రకారం ఏటా ఆడిట్ నిర్వహించాలి. ఈవిషయాన్ని ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక సిబ్బంది కొందరు సంస్థ నగదును ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు పంపించాల్సిన నిధులను సొంత జేబుల్లోకి మళ్లించుకుం టున్నారు. అధికారులు మొక్కుబడిగా పరిశీలనలకు వచ్చి వెళుతున్నారనే విమర్శలున్నాయి. చివరకు సరకులు పాడైనట్లు చూపి చెక్కబెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

విధులంటేనే భయం

ప్రస్తుతం పాల్వంచ జీసీసీ బియ్యం, నిత్యావసరాల గోదాము ఇన్‌ఛార్జిగా మేనేజర్ లక్ష్మీజీ వ్యవహరిస్తున్నారు. అతడి నుంచి ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇద్దరు సీనియర్ సేల్స్‌మెన్లకు విధులు అప్పగించడానికి డీఎం యత్నించినా వారు ఒప్పుకోలేదని సమాచారం. గతంలో జరిగిన అక్రమాలకు తమనెక్కడ బలి చేస్తారోనన్నదే వారి భయం. ఐటీడీఏ పీఓ ద్వారా బలవంతంగా సీనియర్స్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడానికి స్థానిక అధికారులు ప్రయత్నిస్తుండటం గమనార్హం. మరోవైపు జీసీసీలో ప్రైవేటు వ్యక్తులకు రూ.వేలు చెల్లిస్తూ రికార్డులు రాయిస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.ప్రైవేటు వ్యక్తులకు పనులు అప్పగించటం లేదు. పెట్రోల్ బంక్‌లో డబ్బుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేశాం. జీసీసీ నిర్వహణలో లోపాలు లేకుండా చర్యలు చేపడతాం.

లక్ష్మీజీ, మేనేజర్, జీసీసీ

# సారూ... సర్దుకుపోయేదెలా?

సిరిసిల్ల : పాఠశాలలు తెరిచి నెల రోజులు గడిచినా ఇప్పటివరకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు ఇవ్వని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండటంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పాఠశాలలు జూన్ 13న ప్రారంభమయ్యాయి. జులై మొదటి వారంలోగా విద్యార్థులందరికీ పుస్తకాలు అందుతాయని చెప్పిన విద్యాశాఖాధికారులు జులై గడిచిపోతున్నా పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ నెలాఖరులో ఎఫ్‌ఏ-1 పరీక్షలు ఉండటంతో ఎలా చదవాలోనని పిల్లలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం 48 వేల మంది పైచిలుకు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు తమ పై తరగతి విద్యార్థుల పాత పుస్తకాలతోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల్లోని పిల్లలు అధిక సంఖ్యలో సర్కారు బడుల్లో చేరారు. దీంతో సర్దుకుపోదామన్నా వారికి పాత పుస్తకాలు చాలడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఒకటి నుంచి 8వ తరగతి వరకు



పాఠ్య పుస్తకాలను ద్విభాషలలో ముద్రించి పంపిణీ చేస్తోంది. పిల్లలకు ఇంకా కొత్తవి అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ప్రస్తుతం అర్ధ సిలబస్‌తో ముద్రించిన వాటిని మొదటి భాగంగా అందజేస్తున్నారు. మిగతా సిలబస్‌తో అక్టోబరులో అందజేయనున్నట్లు చెబుతున్నారు. సగం సిలబస్‌తో ముద్రించిన వాటిని అందివ్వడంలోనే ఇంత జాప్యం చేస్తున్నారంటే మిగతా వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అక్టోబర్‌లో 72 వేల పైచిలుకు పుస్తకాలను అందజేయనున్నారు. మొదటగా వీటిని జిల్లా వనరుల కేంద్రానికి, ఆ తరవాత మండల వనరుల కేంద్రాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు చేర్చాలి. ఆ తరవాత విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. రవాణాలోనూ కొంత జాప్యం నెలకొంటుంది. మరోవైపు పూర్తిస్థాయిలో పిల్లలకు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా పంపిణీ చేయాలని కోరుతున్నారు. నెలాఖరులోగా పూర్తిస్థాయిలో అందజేస్తాం - డి.రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

జిల్లాలో విద్యార్థులకు ఇప్పటివరకు 80 శాతం పుస్తకాలను అందజేశాం. ఈ నెలాఖరులోపు పూర్తిస్థాయిలో అందుతాయి. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి పైతరగతి విద్యార్థుల పాత పుస్తకాలను చదువుకుంటున్నారు. ఈ నెలాఖరులోపు అందరికీ ఇస్తాం.

# పనిచేయని ఎత్తిపోతలు

సిరిసిల్ల : ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టు నుంచి వచ్చిన భారీ వరదతో గోదావరి తీరం వెంట ఉన్న ఎత్తిపోతల పథకాలు మునిగిపోయి తీవ్ర నష్టం జరిగింది. బీర్‌పూర్ మండలంలోని మంగెళ, కమ్మునూర్, రేకులపల్లె, చిన్న కొల్వాయి గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలతోనే రైతులకు సాగునీటి ఆధారం. గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో తీరం వెంట ఉన్న ఎత్తిపోతల పథకాలు పూర్తిగా మునిగిపోవడంతో ఆయా పథకాల కింద దాదాపు 3500 ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. చిన్న కొల్వాయిలో ఏర్పాటు చేసిన పథకం ద్వారా కొల్వాయి, ఆరెపల్లి గ్రామాల పరిధిలోని 1300 ఎకరాలు, మంగెళలో 1100 ఎకరాలు, రేకులపల్లెలో 900 ఎకరాలు, కమ్మునూర్‌లో 400ల ఎకరాల వరకు సాగు నీరు అందుతుండేది. ఆయా పథకాల ద్వారా ఇప్పటికే వరినార్లు పోసుకుని నాటుకు సిద్ధంగా ఉన్న రైతులకు ఎత్తిపోతల పథకాలు పనిచేయకపోవడంతో ప్రస్తుతం పంట కాలం దాటుతుందని ఆవేదన చెందుతున్నారు. పథకాల లోపలికి వరద నీటితో బురద చేరి విద్యుత్తు మోటార్లు పూర్తిగా పాడైపోయాయి. దీనికి తోడు వరద తాకిడికి విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు పూర్తిగా పడిపోయాయి. మరమ్మతులకు రూ.లక్షల్లో అవసరమవుతుండడంతో చేసేదేమీలేక ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గతేడాది చిన్న కొల్వాయి ఎత్తిపోతల పథకం పనిచేయకపోవడంతో రైతులే రూ.3లక్షలు జమ చేసుకుని ఒక్క మోటారుకు మరమ్మతులు చేసుకుని సాగు చేసుకున్నారు. మళ్లీ ఈ ఏడాది వరద ఉధృతితో నష్టపోవాల్సి



రావడంతో రైతులు మళ్లీ ఎక్కడి నుంచి తీసుకువచ్చేదంటూ ఆవేదన చెందుతున్నారు. ఇటు గోదావరి వరద ఉధృతితో ఎత్తిపోతల పథకాలకు నష్టం జరిగితే.. అటూ రోళ్లవాగు, అరగుండా ప్రాజెక్టులకు గండ్లు పడడంతో బీర్‌పూర్ మండలంలో పూర్తిగా సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది.

గతేడాదే మరమ్మతులు - పనగంటి నర్సయ్య, కొల్వాయి

ఎత్తిపోతల పథకాలు చెడిపోతే గతేడాది రూ.3 లక్షలు వ్యయం చేసి ఒక మోటారును మరమ్మతులు చేసుకున్నాం. ప్రస్తుతం గోదావరి వరద ఉధృతితో మళ్లీ మోటార్లు, నియంత్రికలు పాడైపోయాయి. ప్రస్తుతం వానాకాలం పంట ప్రారంభమై వరినాట్లు వేసుకునే సమయంలో వరద తాకిడితో ఎత్తిపోతల పథకాలు పనిచేయకుండా ఉన్నాయి. పథకాలు పనిచేయకపోవడంతో వందలాది ఎకరాలు బీళ్లుగా మారనున్నాయి. ప్రభుత్వం మరమ్మతులకు నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలి.

ప్రభుత్వానికి నివేదిస్తాం - చక్రునాయక్, డీఈఈ

గోదావరి వరద ఉధృతి దెబ్బతిన్న ఎత్తిపోతల పథకాల నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. ఒక్కో ఎత్తిపోతల పథకం అయ్యే వ్యయ వివరాల అంచనాలు తయారు చేసి, మరమ్మతులు చేపట్టేలా చూస్తాం. గతేడాది కొల్వాయి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.31 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

# బియ్యం సేకరణకు తొలగిన అడ్డంకి



హుజూర్‌నగర్ : రాష్ట్రం నుంచి తక్షణమే బియ్యం సేకరణ ప్రారంభించాలని కేంద్రం నిర్ణయించటంతో ఉమ్మడి జిల్లాలో అడ్డంకులు తొలగిపోయాయి. ఉచిత బియ్యం పంపిణీ చేయటం లేదని, అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై చర్యలు తీసుకోవటం లేదని కేంద్రం గత నెల 7 నుంచి బియ్యం సేకరణ నిలిపేసిన సంగతి తెలిసిందే. ఈ రెండింటి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావటంతో తక్షణమే బియ్యం సేకరణ ప్రారంభించాలని కేంద్ర మంత్రి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)ను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 రోజులుగా మూతవడ్డ మిల్లులు మళ్లీ తెరుచుకోనున్నాయి. కేంద్రం పచ్చజెండా ఊపడంతో 2020-21 యాసంగి బకాయిలు, వానాకాలం బియ్యం సేకరణ షురూ కానుంది. 2020-21 యాసంగి ధాన్యం మర ఆడించగా వచ్చిన బియ్యం సేకరణకు ఎఫ్‌సీఐ 8 సార్లు గడువు ఇచ్చింది. కానీ ఆ లక్ష్యాన్ని చేరుకోలేదు. బియ్యం అప్పగించని మిల్లర్లపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమయ్యే క్రమంలోనే ఎఫ్‌సీఐ సేకరణను నిలిపివేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలో బకాయి బియ్యం సేకరణపై ఒత్తిడి లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లాలో మిల్లర్ల నుంచి రూ.329.36 కోట్ల విలువైన 1,03,270 మెట్రిక్ టన్నుల బియ్యం బకాయిలు ఉన్నాయని ఎఫ్‌సీఐ గత నెలలో ప్రకటించింది.

ప్రస్తుత పరిస్థితి ఇది

గత జూన్ 7 నుంచి ఎఫ్‌సీఐ 2020-21 యాసంగి బియ్యం బకాయిలతోపాటు తాజా వానాకాలం బియ్యం సేకరణ కూడా ఆపేసింది. ఉమ్మడి జిల్లా నుంచి ఉన్న బియ్యం బకాయిల్లో సూర్యాపేట జిల్లా వాటానే ఎక్కువగా ఉంది. ఇది రాష్ట్రంలో అత్యధికం కావడం విశేషం.

బకాయి సేకరణ పూర్తయ్యేనా

ఉమ్మడి జిల్లా నుంచి 2020-21 యాసంగి బియ్యం రాబట్టేందుకు రాష్ట్ర అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. గతంలో ఎఫ్‌సీఐ బియ్యం అప్పగించని మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం సర్క్యులర్ ద్వారా తెలియజేసింది. వాటిని అమలు చేసి మిల్లర్ల నుంచి బకాయిలు సేకరించాల్సి ఉంది. అందుకు బకాయిదారులపై కఠిన చర్యలకు దిగకతప్పని పరిస్థితి ఉంది. మరోవైపు ఆ మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వలు లేని పక్షంలో అధికారులు ఎలాంటి చర్యలకు దిగుతారో వేచి చూడాల్సిందే.

# పంచాయతీల్లో అవే బాధలు!




సూర్యాపేట : గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రతి నెల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తున్నాయి. వాటితో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని గ్రామ పంచాయతీలకు నేరుగా అందించాలని నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా అధికారుల నిర్ణయం మేరకు ఆయా గ్రామ పంచాయతీల పేరిట సర్పంచులు ఎస్‌బీఐలో శూన్య నిల్వ ఖాతాలు తెరిచారు. ప్రతి నెలా విడుదల చేస్తామని చెప్పడంతో సర్పంచులు, పాలకవర్గాలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ మూడు నెలలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల చేయకపోవడంతో ఆనందం ఆవిరైపోయింది. దీంతో సర్పంచులకు మళ్లీ అవే బాధలు పునరావృతం అవుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1740 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి కేంద్రమే నిధులు నేరుగా జమ చేస్తామని ప్రకటించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఈ ఏడాది మార్చిలోనే జారీ చేసింది. తెరిచిన బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెలా 15వ కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నేరుగా జమ చేస్తామని పేర్కొన్నారు. కానీ సదరు ఖాతాల్లో నేటికీ ఒక్క పైసా నిధులు జమ కాకపోవడంతో సర్పంచులు నిరాశలో ఉన్నారు.

చెక్కుల వివరాలు నమోదు

గ్రామ పంచాయతీలు తెరిచిన ఖాతా వివరాలను పీఎఫ్‌ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం) పోర్టల్‌లో పొందుపరిచారు. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి వీటిల్లో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు జమ అవుతాయని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం సర్పంచి, ఉప సర్పంచులు, బ్యాంకులు ఇచ్చిన చెక్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అవి పూర్తికాగానే విడుదల చేయనున్నారని తెలుస్తోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను ఎలా డ్రా చేయాలో... వాటిని ఏఏ అభివృద్ధి కార్యక్రమాలకు వాడుకోవాలో ఇప్పటికే జిల్లా అధికారులు శిక్షణ ఇస్తున్నారు. అక్కడి శిక్షణ పూర్తి కాగానే సర్పంచులకు, పాలకవర్గాలకు శిక్షణ ఇస్తారు. అనంతరమే నిధులు విడుదల చేయనున్నట్లు సమాచారం. కానీ ఈ ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాకపోవడంతో నిధుల జమలో ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

త్వరలో నిధులు విడుదల - యాదయ్య, డీపీఎం, సూర్యాపేట

గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనున్నట్లు ఉత్తర్వులు అందాయి. పీఎఫ్‌ఎంఎస్‌పై అవగాహన కోసం జిల్లా నుంచి ముగ్గురు ఆపరేటర్లు కమిషనరేట్కు వెళ్తున్నారు. వీరు సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ పొందిన తర్వాత సర్పంచులు, ఉప సర్పంచులకు వివరిస్తారు. అనంతరం నిధులు విడుదల చేస్తారు.

# పునరావాసమే అసలు సమస్య

నల్గొండ : యాదాద్రి జిల్లాలోని పది మండలాల్లోని 1.88 లక్షల ఎకరాలకు సాగునీరందించే బస్వాపురం రిజర్వాయర్‌లో విడుదలకు గోదావరి జలాలు సిద్ధమైనా పునరావాసం సమస్యతో వెనకడుగు పడుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు 16వ ప్యాకేజీలో భాగంగా 11.39 టీఎంసీల సామర్థ్యంతో రూ.1610 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో రెండేళ్ల క్రితమే సుమారు ఒకటిన్నర టీఎంసీల నీళ్లు నింపాల్సి ఉంది. అయితే ఈ ప్రాజెక్టు ముంపు గ్రామమైన బీఎన్ తిమ్మాపురం గ్రామస్థులకు ఇంకా పరిహారం అందకపోవడంతో ప్రాజెక్టులో ఇప్పుడు కేవలం 0.8 టీఎంసీల నీటిని నింపేందుకు మాత్రమే అవకాశం ఉన్నట్లు నీటిపారుదల శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ప్రాజెక్టులో ఒకటిన్నర టీఎంసీల నీళ్లు నింపితే తిమ్మాపురం గ్రామం ముంపునకు గురవుతుంది. తమకు మెరుగైన పరిహారం, ప్యాకేజీ ఇస్తేనే తాము ఖాళీ చేస్తామని నిర్వాసితులు వెల్లడిస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టులో తమది 45 ఎకరాల భూమి ఉందని, దీనికి సంబంధించి అధికారులు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని ఆరోపిస్తూ బస్వాపురం గ్రామస్థులు ప్రాజెక్టు కట్టపై గురువారం ఆందోళన చేశారు.

75 శాతం పనులు పూర్తి

గతేడాది జూన్ నాటికే ప్రాజెక్టు పనులు పూర్తి కావాల్సి ఉన్నా వివిధ కారణాలతో గడువును ఈ ఏడాదికి పొడిగించారు. అది సైతం సమీపిస్తుండటంతో అధికారులు ప్రాజెక్టు నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతున్నారు. 13.7 కి.మీ. పొడవైన కట్ట పనుల్లో ఇప్పటి వరకు 8 కి.మీ. పూర్తి కాగా...మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు రూ.1200 కోట్ల వరకు ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఖర్చు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గత రెండు పంటలకు ముందే కాల్వలకు నీళ్లు వదిలి తొలి దశలో దాదాపు 25 వేల ఎకరాలకు నీళ్లివ్వాలని అధికారులు యోచించినా పునరావాసం సమస్యపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. దీంతో అధికారులు మిగిలిన పనులను పూర్తి చేసిన తర్వాతే కాల్వలకు నీళు వదలాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు సుమారు 75 శాతం పనులు పూర్తి అయ్యాయి. వచ్చే రెండు మూడు నెలల్లో ఎగువన ఉన్న కొండపోచమ్మ సాగర్ నుంచి బస్వాపురం ప్రాజెక్టులో 8 టీఎంసీల నీటిని నింపి కాల్వలకు నీళ్లందిస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే యాదాద్రి జిల్లాలోని ఆలేరు, ఆత్మకూరు, తుర్కపల్లి, భువనగిరి, యాదగిరిగుట్ట, మోటకొండూరు, వలిగొండ, చౌటుప్పల్, చిట్యాల, రామన్నపేట మండలాల్లోని సాగు భూములకు నీరందనుంది.



రెండు నెలల్లో పూర్తి: ఖుర్షిద్ మొయినొద్దీన్, ప్రాజెక్టు ఈఈ

నిర్వాసితులకు రెండు నెలల్లో పునరావాస ప్యాకేజీ అందజేసి వారందరినీ ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు తరలిస్తాం. అప్పుడే 8 టీఎంసీల నీటితో రిజర్వాయర్‌ను నింపి కాల్వల ద్వారా నీళ్లందిస్తాం. పెండింగ్‌లో ఉన్న కాల్వల నిర్మాణాలు సైతం రెండు మూడు నెలల్లో పూర్తి చేస్తాం.

పెండింగ్‌లోనే 2500 ఎకరాల భూ సేకరణ

జలాశయం, కాల్వల నిర్మాణానికి ఇంకా 2500 ఎకరాల వరకు భూ సేకరణ చేయాల్సి ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఒక్క జలాశయానికి ఇంకా రెండు వేల ఎకరాల వరకు కావాల్సి ఉంది. బీఎన్ తిమ్మాపురంలో ఇంకా 900 ఎకరాల వరకు సేకరించాల్సి ఉంది. అయితే ఇప్పటికే వారికి పునరావాస ప్యాకేజీ ఇవ్వకపోవడంతో వారు భూసేకరణకు అడ్డుగా నిలుస్తున్నారు. తొలుత పునరావాస ప్యాకేజీ నిర్వాసితులకు చెల్లిస్తే ప్రాజెక్టు పనులు మరింత తొందరగా అవుతాయని గుత్తేదారు కంపెనీ ప్రతినిధులు వెల్లడిస్తున్నారు. మొత్తం 60 కి.మీ. పొడవు మేర నిర్మిస్తున్న కాల్వల నిర్మాణంలో ఇప్పటికే 40 కి.మీ. తవ్వి లైనింగ్ పనులను సైతం పూర్తి చేశారు. మరో 20 కి.మీ. కాల్వలు తవ్వాల్సి ఉంది.

# ఆధార్‌తో ఓటు అనుసంధానం

మిర్యాలగూడ : బోగస్ ఓట్లను నిరోధించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఆధార్‌తో ఓటును అనుసంధానం చేయాలని నిర్ణయించింది. అయితే ఇది తప్పనిసరి కాదని.. ఓటర్లు స్వచ్ఛందంగా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కాగా ఈ ప్రక్రియ ఆగస్టు ఒకటి నుంచి ప్రారంభించేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఓటర్లు ఫామ్ 6బీ దరఖాస్తుల ద్వారా ఆన్‌లైన్‌లో ఆధార్ వివరాల నమోదుకు అవకాశం కల్పించనున్నారు. ఓటరు ఇష్టానుసారమే ఈ



ప్రక్రియ జరగనుంది. ఓటుకు..ఆధార్ అనుసంధానంపై త్వరలోనే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు సమాచారం. ఇప్పటికే డబుల్ ఓట్లు తొలగింపు.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా.. 2021 జనవరి 5న కేంద్ర ఎన్నికల సంఘం విడుదల జాబితా ప్రకారం మొత్తం 26,99,217 మంది ఓటర్లు ఉన్నారు. వీటిలో అత్యధిక బోగస్ ఓట్లు సైతం ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఒక నియోజకవర్గంలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నవాటిని బీఎల్వోలు క్షేత్ర స్థాయిలో విచారించి తొలగించారు. పురపాలికల్లో తమకు అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లను పలువురు నాయకులు తమ వార్డుల్లో అక్రమంగా చేర్పించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని నిర్ణయించింది.

# అరకొరగానే డీఏపీ నిల్వలు

సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థ మార్క్‌ఫెడ్ వద్ద రసాయన ఎరువైన డీఏపీ నిల్వలు లేవు. ప్రయివేటుగా సైతం అరకొరగానే దొరుకుతున్నాయి. ఆరంభంలోనే అన్నదాతకు ఎరువుల ఇబ్బందులు తప్పడం లేదు. కంపెనీలు ఏటా సీజన్‌ల ప్రకారం ఎరువుల ధరలు పెంచడం, కృత్రిమ కొరత సృష్టించడం పరిపాటిగా మారుతోంది. ఇప్పటికే బఫర్ స్టాకులు ఉంచుకోవాల్సి ఉన్నా సరఫరా లేక మార్క్‌ఫెడ్ వద్ద సైతం నిల్వలు నిండుకున్నాయి. కాంప్లెక్స్ ఎరువుల నిల్వలూ తక్కువే ఉన్నాయి. కంపెనీలు నేరుగా డీలర్లకు ఎరువులు సరఫరా చేస్తుండటంతో ఏటా సీజన్ రాకముందు ప్రణాళిక ఉంటుంది. వానాకాలం పంటకు అవసరమైన నిల్వలు ఎంత ఉంచాలో, నెలవారీ సరఫరా ఎంత అనే అంచనాలను వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తాయి. అందుబాటులో ఉన్న నిల్వలను బట్టి రాష్ట్రాలకు కేంద్రం నెలవారీ కోటాను కేటాయిస్తుంది. ఈసారి అందుకు భిన్నంగా నేటి వరకు డీఏపీ కొత్త నిల్వలు రాలేదు. ఉన్న నిల్వలను ఇప్పటికే సొసైటీలకు సరఫరా చేశారు.

సీజన్ వచ్చింది

ఉమ్మడి జిల్లాలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆల్‌మట్టి, శ్రీశైలం రిజర్వాయర్లు నిండుకుండల్లా తయారయ్యాయి. కొద్దిరోజుల్లో సాగర్‌కు నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉంది. ఆగస్టు తొలి వారంలోనే సాగర్ ఎడమ, కుడి కాల్వలకు నీరు అందించడానికి కసరత్తు చేస్తున్నారు. దీంతో పాటు చెరువులు, కుంటలు నిండి అలుగులు పోస్తున్నాయి. బోర్లు, బావుల కింద సైతం నాట్లు మొదలవుతున్నాయి. ఆగస్టు మొదటి వారంలో నీరు విడుదల చేస్తే రెండో వారంలోనే డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులకు భారీగా డిమాండ్ ఉంటుంది. ఆ సమయంలో కొరత లేకుండా ఉండాలంటే ఇప్పటికే నిల్వలు సిద్ధంగా



ఉండాలి. ఆగస్టు నెల కోటా వెంటనే సరఫరా చేయాలి. వాస్తవానికి కేంద్రం డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులకు భారీ రాయితీ ఇస్తుంది. ఒక్క డీఏపీకే 50 కిలోల బస్తాకు రూ.2500 రాయితీ ఇస్తోంది. అన్ని కంపెనీలు డీఏపీ బస్తా రూ.1350కి అమ్మాలని సూచించింది. ఈ-పాస్ విధానం ద్వారా రైతు ఎరువు కొన్నట్లు ఆన్‌లైన్ ద్వారా సమాచారం రాగానే రాయితీ డబ్బులను ఆయా కంపెనీల ఖాతాలలో జమచేస్తుంది. తయారీ ఖర్చు పెరిగి నష్టాలు వస్తున్నాయని తయారీ సంస్థలు డీఏపీ ఉత్పత్తిని తగ్గించుకుంటున్నాయని సమాచారం. దీనికి తోడు డీఏపీతో అనేక లింకు మందులు అంటగడుతుండటంతో డీలర్లు సైతం డీఏపీ కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. కాంప్లెక్స్ కంటే డీఏపీ బస్తాకు రూ.100 ధర తక్కువగా ఉండటంతో రైతులు దీని వైపు మొగ్గుచూపుతున్నారు.

అవసరం ఇలా..ఉమ్మడి జిల్లాలో దాదాపు 11 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. దీంతో పాటు పత్తి, మిరప, మొక్కజొన్న ఇతర పంటలు సాగవుతున్నాయి. వీటన్నింటికి డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు తప్పనిసరి. సుమారు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంటుంది. ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ సొసైటీల ద్వారా 14,500 క్వింటాళ్ల ఎరువులు (డీఏపీ, కాంప్లెక్స్, యూరియా) అమ్మారు. డీఏపీ నిల్వలు లేనేలేవు. కాంప్లెక్స్ ఎరువులు 5560 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. నిల్వలు తక్కువగా ఉన్నాయి.. రామారావునాయక్, డీఏవో, సూర్యాపేటబఫర్ స్టాకులు తక్కువగానే ఉన్నాయి. రెండు మూడు రోజుల్లో ఒక ర్యాక్ వచ్చే అవకాశం ఉంది. ఎరువులు పంపించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నాం. ఆగస్టు కోటా వస్తే సమస్య కొంతమేర తగ్గుతుంది. కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు కొంత వరకు ఉన్నాయి.




వాషింగ్టన్: ప్రస్తుతం భారత రాజకీయాల్లో ప్రతిపక్షాలు చాలా ఐక్యంగా ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తాయని ఆయన విపక్షాల విజయంపై ధీమా వ్యక్తం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్.. తాజాగా వాషింగ్టన్‌లోని నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. "వచ్చే రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నేను విశ్వసిస్తున్నా. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించి భాజపాను గద్దె దించింది. త్వరలో జరగబోయే మూడు, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా చూడండి. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై ఈ రాష్ట్రాల ఫలితాలు స్పష్టమైన సంకేతాలిస్తాయి. ఇప్పుడు భారత్‌లో ప్రతిపక్షాలు మరింత ఐక్యంగా ఉన్నాయి. విపక్ష పార్టీలతో కాంగ్రెస్ విస్తృతంగా సమావేశాలు జరుపుతోంది. విపక్షాల ఐక్యత సరైన మార్గంలో వెళ్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు కచ్చితంగా ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తాయి" అని రాహుల్ తెలిపారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాపులారిటీ గురించి ప్రశ్నించగా.. "దేశంలోని అన్ని సంస్థలపై ప్రభుత్వం నియంత్రణ ఉంది. పత్రికారంగంపైనా వారు పట్టుబిగించారు. అయితే ఆ వార్తలను నేను ఎప్పటికీ నమ్మబోను" అని రాహుల్ సమాధానమిచ్చారు. ఇక, ఈ సందర్భంగా మీడియా స్వేచ్ఛ గురించి స్పందిస్తూ.. "ప్రజాస్వామ్య వ్యవస్థకు మీడియా స్వేచ్ఛ అత్యంత కీలకమైనది. విమర్శలను హుందాగా స్వీకరించాలి. కానీ, భారత్‌లో ఈ స్వేచ్ఛను బలహీనపరుస్తున్నారు. మీడియాపై నిర్బంధం ఉంది" అని భాజపా సర్కారుపై రాహుల్ విమర్శలు గుప్పించారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను భాజపా నేతలు ఖండిస్తున్నారు. కాంగ్రెస్ నేత విదేశీ గడ్డపై భారత ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.




దిల్లీ: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై దిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మహిళా అథ్లెట్లతో ఆయన దారుణంగా ప్రవర్తించారని, ఛాతీపై తాకడం, రెజ్లర్లతో అసభ్య పదజాలాన్ని ఉపయోగించి సంభాషించడం వంటివి చేసేవారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎఫ్ఐఆర్ కాపీలోని అంశాలను పలు జాతీయ మీడియా కథనాలు ప్రచురించాయి. బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భారత అగ్రశ్రేణి రెజర్లు గత కొన్ని రోజులుగా దిల్లీలో ఆందోళన చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఏడుగురు మహిళా రెజర్లు ఆయనపై ఫిర్యాదులు చేయడంతో దిల్లీలోని కన్నాట్‌ప్యాలెస్ పోలీసు స్టేషన్‌లో గత నెల రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆరుగురు మహిళా రెజర్లతో మొదటి ఎఫ్ఐఆర్, మరో మైనర్ రెజ్లర్ తండ్రి ఫిర్యాదుతో రెండో ఎఫ్ఐఆర్‌ను ఏప్రిల్ 28న నమోదు చేశారు. బ్రిజ్ భూషణ్ తమతో అత్యంత అనుచితమైన, దారుణమైన రీతిలో బెదిరింపులు, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని రెజ్లర్లు ఆరోపించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆయనకు భయపడి మహిళా అథ్లెట్లు ఎప్పుడూ తమ గదుల్లో నుంచి బయటకు వచ్చినా బృందాలుగానే ఉండేవారట. "అయినప్పటికీ.. ఆయన మా బృందంలో నుంచి ఒకరిని వేరుగా తీసుకెళ్లి అభ్యంతరకర ప్రశ్నలు అడిగేవారు. వాటికి సమాధానాలు చెప్పలేకపోయేవాళ్లం" అని ఓ బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. "ఓ రోజు ఆయన నన్ను పిలిచి నా టీ-షర్ట్ లాగారు. శ్వాస ప్రక్రియను చెక్ చేస్తున్నానంటూ నా ఛాతీపై, పొట్టపై అభ్యంతరకరంగా తాకారు. ఓసారి నాకు తెలియని ఓ పదార్థాన్ని తీసుకొచ్చి తినమని చెప్పారు. దాని వల్ల ఫిట్‌గా ఉంటావని, ప్రదర్శన బాగా చేయొచ్చని చెప్పేవారు" అని మరో బాధితురాలు ఆరోపించింది. కోచ్ లేని సమయంలో తమ వద్దకు వచ్చి ఇలాగే అభ్యంతరకరంగా ప్రవర్తించేవారని అవార్డు గెలుచుకున్న ఓ రెజ్లర్ ఆరోపణలు చేశారు. "విదేశాల్లో జరిగిన పోటీల్లో నేను గాయపడ్డాను. అప్పుడు ఆయన (బ్రిజ్‌భూషణ్) నా వద్దకు వచ్చి.. తనతో సాన్నిహిత్యంగా ఉంటే ట్రీట్మెంట్ ఖర్చులన్నీ ఫెడరేషనే భరిస్తుందని చెప్పారు" అని మరో బాధితురాలు తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేసింది. ఫొటో తీసుకుందామంటూ తనను బలవంతంగా గట్టిగా హగ్ చేసుకున్నారని మరో రెజర్ల్ ఆరోపించింది. ఇక, రెజ్లింగ్ సమాఖ్య సెక్రటరీ వినోద్ తోమర్‌పైనా ఓ రెజ్లర్ లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఓ సారి తాను దిల్లీలోని డబ్ల్యూఎఫ్ఐ కార్యాలయానికి వెళ్లినప్పుడు.. తోమర్ తనతో అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. గదిలో అందర్నీ బయటకు పంపించి.. తనను బలవంతంగా ఆయనవైపు లాక్కొన్నారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. ఈ ఆరోపణలను బ్రిజ్‌భూషణ్ ఖండిస్తూనే ఉన్నారు. రెజ్లర్లు చేసిన ఆరోపణలు నిజమని తేలితే తాను ఉరేసుకోడానికైనా సిద్ధమేనని తెలిపారు. మరోవైపు, బ్రిజ్‌భూషణ్‌పై వచ్చిన ఆరోపణలపై త్వరలోనే తుది నివేదకను కోర్టులో సమర్పించేందుకు దిల్లీ పోలీసులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## లోకేష్ పాదయాత్రపై వైసీపీ కుట్ర రాజకీయం



అమరావతి: ప్రొద్దుటూరులో టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రపై వైసీపీ మూకల దాడిని టీడీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. దాడికి సంబంధించి వైసీపీపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రపై వైసీపీ కుట్ర రాజకీయం చేస్తోందని విమర్శించారు. యువగళం పాదయాత్రపై ప్రొద్దుటూరులో కోడిగుడ్ల దాడి అందులో భాగమే అని ఆరోపించారు. టీడీపీ పాలనలో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ రెడ్డి వేల కిలోమీటర్లు స్వేచ్ఛగా పాదయాత్ర చేసిన విషయాన్ని సీఎం అయిన తర్వాత మరిచినట్లు ఉన్నారన్నారు. యువనేత లోకేష్ పాదయాత్రకు లభిస్తున్న అపూర్వ ప్రజాస్పందనను జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు ఇలాంటి చిల్లర పనులకు దిగజారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుల కార్యక్రమాలకు భద్రత కల్పించే విషయంలో పోలీసులు ఎంతమాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్లుతెరిచి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కాల్వ శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

## నాలుగేళ్ళ పాలనలో అభివృద్ధి ఏం చేశారో సీఎం చెప్పాలి..



అనంతపురం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఇవాళ ఘనంగా చేసుకుంటున్నారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దురదృష్ట దినోత్సవం జరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయం తక్కువగా ఉందని.. అభివృద్ధి లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి అభివృద్ధి అని చెప్పి వందల కోట్లు కాజేస్తున్నారని ఆరోపించారు. నాలుగేళ్ళ పాలనలో అభివృద్ధి ఏం చేశారో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును కుదించడానికి ఒప్పుకున్నారని, రాష్ట్రంలో ఎక్కడ ఒక్క ప్రాజెక్టు కట్టలేదన్నారు. సీఎం జగన్ రాష్ట్ర అభివృద్ధికి సమాధి కడుతున్నారని రామకృష్ణ ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు సాధన కొరకు, నిర్వాసితులకు ఇళ్లు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 12వ తేదీ.. నుంచి పోలవరం ప్రాంతంలో పాదయాత్ర చేపడుతున్నామని వెల్లడించారు. అప్పులు చేస్తున్నా.. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నారని .. ఏ రంగంలోనైనా అభివృద్ధి ఉందా.. అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని దివాళా తీసే దిశగా పాలన సాగుతోందని, భారత దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా జగన్ ఉన్నారన్నారు. కమ్మ కులాలను టార్గెట్ చేసి... కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ఈనాడు మార్గదర్శిలోను దాడులు చేయిస్తున్నారని, కులాల గురించి మాట్లాడుతూ.. వర్గాలపై పోరాడుతున్నామని అబద్దాలు చెప్తున్నారని రామకృష్ణ తీవ్రస్థాయిలో విమర్శించారు.




హైదరాబాద్: ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్ట్ అయిన వైఎస్ భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. బెయిల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ జూన్ 5కి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా.. వివేకా హత్య కేసులో ఐదు మంది నిందితులను సీబీఐ కోర్టు ముందు హాజరుపరిచింది. ఎర్ర గంగి రెడ్డి, సునీల్ యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డిను సీబీఐ కోర్టు ఎదుట హాజరుపరిచింది. భాస్కర్ రెడ్డి అనారోగ్య కారణంతో హాజరు కాలేకపోయారని న్యాయవాదులు తెలిపారు. నేడు కూడా విచారణకు అప్రూవర్ దస్తగిరి హాజరు కాలేదు. తదుపరి విచారణను 16వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. వివేకా కేసులో సహ నిందితుడిగా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. పలు షరతులు విధిస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషనపై జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టడం, మే 26, 27 తేదీల్లో అవినాశ్‌రెడ్డి తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు, వివేకా కుమార్తె సునీతారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్, సీబీఐ న్యాయవాదులు అనిల్ తల్వార్, అనిల్‌కుమార్ కొంపల్లి వాదనలు వినిపించడం.. 27న ధర్మాసనం తీర్పు రిజర్వు చేయడం తెలిసిందే. బుధవారం (మే 31, 2023) దానిని వెలువరించింది. అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయాల్సి వస్తే రూ.5 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు ష్యూరిటీలు తీసుకుని విడుదల చేయాలని సీబీఐని ఆదేశించింది. సీబీఐ అనుమతి లేకుండా పిటిషనర్ దేశాన్ని వీడరాదని పేర్కొంది. సీబీఐకి సహకరించాలని.. దర్యాప్తులో జోక్యం చేసుకోవడం, సాక్షులను ప్రభావితం చేయడం వంటివి చేయరాదని.. జూన ముగిసేవరకు ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీఐ అధికారుల ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. దర్యాప్తు సంస్థ ఎప్పుడు కోరితే అప్పుడు రావాలని పేర్కొంది. నిబంధనలు పాటించకపోతే అవినాశ్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని సీబీఐ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

## జగన్ జిల్లాలో జాగ్రత్త గా లోకేష్ అడుగులు



అమరావతి : పోయిన చోటనే రాబట్టుకోవాలన్నది నీతి. రాజకీయాల్లో కూడా అలాంటి నీతే అప్లై అవుతుంది. ఇక ప్రత్యర్థికి గట్టి పట్టున్న చోట దెబ్బతీయాలన్న ఆరాటం ఎటూ ఉంటుంది. టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్ ఇపుడు కడప జిల్లాలో పాదయాత్ర చేస్తున్నారు. ఆయన ఇపుడు టీడీపీ జోరు అక్కడ పెంచడానికి చూస్తున్నారు. కర్నూల్ జిల్లా ఆళ్ళగడ్డ నుంచి కడప జిల్లా జమ్మలమడుగులో లోకేష్ అడుగు పెట్టారు. ఆ నియోజకవర్గంలో పాదయాత్ర బాగానే సాగింది. మాజీ మంత్రి బీజేపీ నేత ఆదినారాయణ రెడ్డి సోదరుడు కొడుకు భూపేష్ రెడ్డికి 2024లో పోటీ చేయడానికి టికెట్ ఖరారు అయింది అని ప్రచారం సాగుతోంది. ఒకవేళ చివరి నిముషంలో ఆదినారాయణరెడ్డి టీడీపీలోకి వచ్చి చేరినా భూపేష్ రెడ్డికే మద్దతు ఇవ్వాలని అంటున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే ఆయనకు న్యాయం చేస్తారని అంటున్నారు. అలా జమ్మలమడుగులో టీడీపీలో పోరు లేకుండా చూసి వైసీపీకి గట్టి సవాల్ విసిరారు. ఇపుడు పొద్దుటూరులో లోకేష్ పాదయాత్ర మొదలైంది. ఇక్కడ ఇద్దరు టీడీపీ లీడర్ల మధ్య టికెట్ కోసం పోరు సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి యువ నేత ప్రవీణ్ కుమార్ రెడ్డిల మధ్య బిగ్ ఫైటింగ్ సాగుతోంది. ఇద్దరు రెండు వర్గాలుగా మారి పొద్దుటూరులో పంచాయతీని లోకేష్ ముందు పెట్టేశారు. అయితే లోకేష్ మాత్రం ఎక్కడా తడబాటు పడకుండా ఇద్దరు నేతలకు సర్దుబాటు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం పార్టీ కోసం పనిచేయాలని ఎన్నికల టైం లోనే టికెట్ల కేటాయింపు అని నచ్చచెప్పడంలో చినబాబు సక్సెస్ అయ్యారని అంటున్నారు. పొద్దుటూరులో టీడీపీకి కొంత అనుకూల పవనాలు వీస్తున్నాయని అంటున్నారు. రెండు సార్లు గెలిచిన వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి మీద వ్యతిరేకత టీడీపీకి ఇక్కడ అనుకూలతగా మారుతోంది అంటున్నారు. ఇక లోకేష్ ఇంతకు ముందే రాజంపేట అసెంబ్లీ పరిధిలో పాదయాత్ర ముంగించారు. ఇక్కడ వైసీపీ సిట్టింగ్ ఎంపీగా మేడ మల్లికార్జున రెడ్డి ఉన్నారు. ఆయన 2014 లో టీడీపీ ఎమ్మెల్యే కూడా. వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్ళీ టీడీపీలోకి వస్తారని అంటున్నారు. ఇక రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని అప్పట్లో ప్రజల నుంచి డిమాండ్ వచ్చినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో జనాల్లో అసంతృప్తి ఉంది. ఆ ఉద్యమానికి మద్దతు ఇచ్చిన మేడ మల్లికార్జున రెడ్డి తన మాట నెగ్గకపోవడంతో నాటి నుంచి కొంత దూరంగా ఉంటున్నారు. ఆయన వైసీపీలో టికెట్ దక్కకపోతే టైం చూసి టీడీపీలోకి వస్తారని అంటున్నారు. దాంతో పాదయాత్రలో ఎక్కడా ఆయన్ని కనీసం విమర్శించకుండా లోకేష్ జాగ్రత్తపడ్డారని అంటున్నారు. మొత్తానికి చూస్తే కడప జిల్లాలో ఇప్పటికి మూడు సీట్లలో లోకేష్ వ్యూహాత్మకంగా సర్దేశారు అని అంటున్నారు. ఒక్క పులివెందుల తప్ప మిగిలిన వాటిలో లోకేష్ పాదయాత్ర సాగనుంది. అందులో కమలాపురం కూడా ఉంది. ఇక్కడ జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన రెండు సార్లు గెలిచారు. ఆయన పట్ల కొంత వ్యతిరేకత ఉంది. దాన్ని కూడా క్యాష్ చేసుకోవాలని లోకేష్ పాదయాత్రలో సీన్ మార్చాలని చూస్తున్నారు. అలాగే రైల్వే కోడూరులో సీనియర్ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీరాములు వరసగా గెలుస్తున్నారు. ఆయన పట్ల సహజంగా ఉండే వ్యతిరేకతను ఎగదోయాలని టీడీపీకి రూట్ క్లియర్ చేయాలని లోకేష్ ప్లాన్ చేసుకుంటున్నారు. అలా వచ్చే ఎన్నికల్లో కడప జిల్లాలో ఉన్న పది సీట్లలో కనీసంగా సగానికి సగం సీట్లలో గెలవాలన్న టార్గెట్ లో లోకేష్ పాదయాత్ర సాగుతోంది. మరి ఈ విషయంలో చినబాబు ప్లాన్ సక్సెస్ అవుతుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

## పోలవరంపై ఎంపీ జీవీఎల్ కీలక ప్రకటన..




అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు శుక్రవారం కీలక ప్రకటన చేశారు. త్వరలో రూ. 12వేల కోట్లకుపైగా నిధులు పోలవరం కోసం ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ పోలవరం నిర్మాణం కోసం రూ. 12, 911 వేల కోట్లను కేంద్రం ఇవ్వబోతోందన్నారు. దీని వల్ల 41.15 ఎత్తులో నీటి నిల్వ చేసుకునేందుకు అవసరమైన నిధులను ఇవ్వనుందని, తొలిదశ పోలవరం నిర్మాణం, ధయాఫ్రం వాల్ మరమ్మత్తుల నిమిత్తం రూ. 12,911 కోట్లను కేంద్రం ఇస్తుందన్నారు.

దీనిపై త్వరలో కేంద్ర కెబినెట్లో నిర్ణయం తీసుకోబోతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రెవెన్యూ డెఫిసిట్ కింద కేంద్రం రూ. 10 వేల కోట్లు ఇచ్చిందని జీవీఎల్ తెలిపారు. స్పెషల్ ఇన్సెంటీవ్స్ ప్యాకేజీ రూపంలో రూ. 10 వేల కోట్లకు పైగా నిధులిచ్చిందన్నారు. ఈ రూ. 10 వేల కోట్లు ఏపీ ప్రజలకు వరమని.. దీంతో కేంద్రం అప్పులపై పరిమితి విధించిందని జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు.

## లింగమనేని రమేశ్ నివాసం జప్తు పిటిషన్‌పై ఈనెల 6న తీర్పు



విజయవాడ: తెదేపా అధినేత చంద్రబాబు అద్దెకు ఉంటున్న లింగమనేని రమేశ్ గెస్ట్ హౌస్ జప్తుపై ఏసీబీ కోర్టు మంగళవారం ఉత్తర్వులు ఇవ్వనుంది. లింగమనేని గెస్ట్‌హౌస్ జప్తుపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు.. ఈనెల 6న నిర్ణయం వెల్లడిస్తామని తెలిపింది. ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న లింగమనేని రమేశ్ నివాసాన్ని అటాచ్ చేయాలంటూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. ఇంటిని జప్తు చేసేందుకు అనుమతి కోరుతూ ఏసీబీ కోర్టులో సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఇరుపక్షాల వాదనలు విని తీర్పును ఈనెల 6కి వాయిదా వేసింది.

## విశాఖ సహా 3 క్యాన్సర్ ఆస్పత్రులకు ఐసీఐసీఐ బ్యాంక్ 1200 కోట్ల సాయం!



ముంబయి: 'టాటా మెమోరియల్ సెంటర్' తమ క్యాన్సర్ చికిత్సా కేంద్రాలను విస్తరించేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ రూ. 1,200 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఐసీఐసీఐ ఫౌండేషన్ నుంచి అందనున్న ఈ మొత్తంతో నవీ ముంబయిలోని ఖర్ఘర్, పంజాబ్‌లోని ముల్లన్‌పూర్ సహా విశాఖపట్నంలోని క్యాన్సర్ చికిత్సా కేంద్రాల సామర్థ్యాన్ని విస్తరించనున్నారు. ఈ మూడు కేంద్రాల్లో విస్తరించిన సదుపాయాలు 2027 నాటికి అందుబాటులోకి వస్తాయని ఐసీఐసీఐ బ్యాంక్ ఛైర్మన్ గిరీశ్ చంద్ర చతుర్వేది తెలిపారు. దీంతో ఏటా 25 వేల మంది క్యాన్సర్ బాధితులకు సేవలందించేందుకు టీఎంసీకి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకు దగ్గర 'కార్పొరేట్ సామాజిక బాధ్యత' నిధి కింద రూ.500 కోట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రానున్న కొన్నేళ్లలో మరిన్ని నిధులు చేరతాయని వెల్లడించారు. ప్రస్తుతం తమ సీఎస్ఆర్ బడ్జెట్‌లో 25 శాతం ఆరోగ్యసంరక్షణ సేవలపై ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

## తనకు బ్రేకిచ్చిన సంస్థకే కళ్లు భైర్లు కమ్మేలా..!

కోటి పారితోషికం అన్న పదం వినేందుకే ఎంతో బరువుగా ఉంటుంది. మెగాస్టార్ చిరంజీవి కోటి పారితోషికం అందుకునేందుకు దశాబ్ధం పైగానే హీరోగా అలుపెరగకుండా శ్రమించాల్సొచ్చింది. కానీ ఇప్పటితరం కథానాయికలు ఇలా నాలుగైదేళ్లలోనే అవలీలగా కోటి పారితోషికం అందుకుంటున్నారు. కోటి అంటే ఖాతరు చేసే పరిస్థితి లేదు ఇప్పుడు. ఇక పరిశ్రమకు పరిచయమైన నాలుగేళ్లకే కోటి పైగా పారితోషికం అందుకుంటున్న రష్మిక మందన వరుస బ్లాక్ బస్టర్లతో లక్కీ ఛామ్ గా మారడంతో ఇక తన డిమాండ్లకు హద్దు అన్నదే లేకుండా పోయిందని టాక్ వినిపిస్తోంది. ఇటీవలి పుష్ప - ది రైజ్ తెలుగు-హిందీలో బ్లాక్ బస్టర్ కొట్టడంతో రష్మిక తన రేంజును అమాంతం పెంచేసిందన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు ముంబై పరిశ్రమలో వరుసగా మూడు నాలుగు చిత్రాలు చేస్తోంది. మరోవైపు టాలీవుడ్ అగ్ర హీరోలందరితోనూ సినిమాలు చేసేస్తోంది. అందుకే ఇప్పుడు దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే పనిలో ఉంది. ఇప్పటికిప్పుడు ఎవరైనా తెలుగు నిర్మాత కనిపిస్తే రూ.2కోట్ల



పారితోషికం డిమాండ్ చేస్తోందట. ఆ ఫిగర్ వినగానే నిర్మాత నీళ్లు నములుతున్నాడని తెలుస్తోంది. రష్మిక మందన్న తన రెమ్యునరేషన్ ని అమాంతం పెంచేసింది. లక్షల్లో అందుకునే ఈ బ్యూటీ ఉన్నట్టుండి కోటికి ఎగబాకి ఇప్పుడు ఏకంగ 2కోట్లు అడిగేస్తోంది. పుష్ప సక్సెస్ కిక్కు ఇది! అంటూ గుసగుసలు వైరల్ గా స్ప్రెడ్ అవుతున్నాయి. ఇప్పటికే పుష్ప సీక్వెల్ కోసం 2కోట్ల రెమ్యూనరేషన్ డిమాండ్ చేసిందట. ఇతర నిర్మాతల నుండి కూడా అదే ఆశిస్తోందట. ప్రఖ్యాత గీతా ఆర్ట్స్ నాయికా ప్రధాన చిత్రానికి సన్నాహాలు చేస్తూ రష్మికను సంప్రదించగా.. భారీ పారితోషికం అడిగిందని తెలిసింది. నిజానికి గీత గోవిందం తో తన రేంజును పెంచింది గీతా సంస్థనే. అయినా కానీ పారితోషికంలో రూపాయి తగ్గేదే లేదని చెబుతోందట. నిర్మాతల నుంచి జీఎస్టీతో పాటు రూ.2 కోట్లు అడిగినట్లు సమాచారం. ఈ చిత్రానికి చిలసౌ-మన్మధుడు 2 చిత్రాలకు దర్శకత్వం వహించిన రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికి ఇంకా రష్మిక ఈ మూవీకి సంతకం చేయలేదు. పుష్ప 2 తర్వాత ఏ సినిమా చేస్తోందో వివరాల్ని వెల్లడించలేదు. అటు హిందీ కమిట్ మెంట్లు పూర్తయితే కానీ ఏదీ చెప్పలేని స్థితిలో ఉందనుకోవాలి. బిగ్ బ్రేకిచ్చిన సంస్థకే కళ్లు భైర్లు కమ్మే ట్రీట్ ఇస్తోంది ప్రస్తుతానికి.

## అతిగా ఆశపడదు.. కానీ పీకేతో మేఘా ఆకాష్ డ్రీమ్!

చెన్నై సోయగం మేఘా ఆకాష్ టాలీవుడ్ కి సుపరిచితమే.'లై 'సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ అటుపై 'ఛల్ మోహన్ రంగ'.. 'రాజ రాజ చోర'.. 'డియర్ మేఘ' లాంటి చిత్రాల్లో నటించింది. కానీ ఇవేవి అమ్మడికి కలిసి రాలేదు. టాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ అవ్వాలని లాంచ్ అయింది గానీ..అమ్మడి డ్రీమ్ మాత్రం నెరవేరలేదు. ఈ గ్యాప్ లో తమిళ..హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అమ్మడికి 2023 ఇయర్ మాత్రం బాగానే కలిసిసొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం మేఘా ఆకాష్ చేతిలో ఐదారు సినిమాలు కనిపిస్తున్నాయి. ఐదారేళ్ల కెరీర్ లో ఏనాడు బ్యాక్ టూ బ్యాక్ ఇన్ని సినిమాలు చేయలేదు. మరి ఈ ఏడాదైనా బ్యూటీకి కలిసొస్తుందేమో చూడాలి. రవితేజ తో రొమాన్స్ చేసిన 'రావణాసుర' రిలీజ్ అవుతుంది. ఇది అమ్మడికి మరో బిగ్ ఆఫర్. ఫెయిల్యూర్స్ ఉన్నా? తనలో యూనిక్ క్వాలిటీని



చూసి దర్శకుడు సుధీర్ వర్మ అమ్మడికి సినిమాలో అవకాశం కల్పించారు. ఈ సినిమా రిలీజ్ నేపథ్యంలో కెరీర్ ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ' నటిగా నా ప్రయాణం పట్ల...నాకు దక్కిన గుర్తింపు పట్ల పూర్తి సంతోషంగా ఉన్నాను. అతిగా ఆశించనడం నాకు నచ్చదు. కానీ పవన్ కళ్యాణ్ గారితో ఒక్క సినిమా అయినా చేయాలన్నది నా డ్రీమ్. అదెప్పుడు నెరవేరుతుందో చూడాలి. నేను ఇష్టపడతే వాతావరణంలో నాకే నచ్చిన పాత్రలతో ప్రయాణాన్ని ఆస్వాదిస్తా. ఒకేసారి మూడు..నాలుగు పాత్రలు చేయాలని ఆరాపడిపోను. ఏమాత్రం విరామం దొరికినా కుటుంబంతోనే సమయాన్ని గడుపుతా. స్నేహితులు చాలా మంది ఉన్నారు. కానీ వాళ్లకి ఇచ్చే సమయం చాలా తక్కువ. అలాగే నేను నటించిన సినిమా ఏదైనా ఒక్కసారే చూస్తా. తర్వాత వాటి గురించి ఆలోచించను.. విశ్లేషణలాంటివి అస్సలు ఉండవు. సెట్లో ఉన్నప్పుడు మానిటర్ లో చూడను. బాగా చేసానా? లేదా? అని దర్శకుడిని అడిగి వదిలేస్తా. ఆయన మాట ఫైనల్ కాబట్టి. అక్కడ అంతకు మించి నటులు చేయాల్సింది ఏమీ ఉండదు' అని అన్నారు.




## తమన్నా బికినీ అందాలు.. మైండ్ బ్లోయింగ్!



అందంతో ఒంపుసొంపులతో తక్కువ సమయంలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. సూపర్ స్ట్రక్చర్ కళ్లు చెదిరే అందం శిల్పి చెక్కినట్లుగా ఒంపులు తిరిగిన శరీరంతో కుర్రాళ్లలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ తమన్నా. ఈ బ్యూటీ ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో తన అందచందాలతో రచ్చ లేపుతోంది. గ్లామర్ షోలో ఏమాత్రం తగ్గడం లేదు. చిట్టి పొట్టి డ్రెస్సులతో థైస్ షో డీప్ లోనెక్ లో ఎద ఎత్తులతో కుర్రాకారును కవ్విస్తోంది. ఈ స్టార్ హీరోయిన్ అందాల ఆరబోతతో కుర్రాళు పిచ్చెక్కిపోతున్నారు. తాజాగా ఈ బ్యూటీ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ట్రావెల్ అండ్ లీజర్ ఇండియా సంస్థ కోసం తమన్నా ఫోటో షూట్లో పాల్గొంది. సింగపూర్ లోని సెంటోసాలో అదిరిపోయే లుక్స్ తో దర్శనమిచ్చింది. చేతిలో సర్ఫ్ బోర్డు పట్టుకుని అలా నీటిలో నుండి నడుస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ పిక్స్ లో తమన్నా అచ్చం జలకన్యలాంటి అందంతో మైమరిపిస్తోంది. మల్టీ కలర్ ఔట్ ఫిట్ నుండి థైస్ అందాలు కుర్రాళ్లను పిచ్చెక్కిస్తున్నాయి. క్లీవేజ్ షోతో అల్లాడించేస్తున్నాయి. అలా నీటిలో నడిచి వస్తూ తన ఒంపు సొంపులను ప్రదర్శిస్తూ తన ఫాలోవర్స్ ను ఆగమాగం చేసేస్తోంది ఈ హాట్ బ్యూటీ. ట్రావెల్ అండ్ లీజర్ ఇండియా సంస్థ తమన్నాను తమ కవర్ స్టార్ గా పేర్కొంది. ఈ గ్లామరస్ బ్యూటీతో ఈ సంస్థ తమ సేవలను ప్రచారం చేస్తోంది. ఇక ప్రస్తుతం తమన్నా చేతిలో ఒకటీ అర సినిమాలు తప్ప పెద్దగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం తెలుగులో భోళా శంకర్ సినిమాలో చిరు సరసన నటిస్తోంది. హిందీలో పలు వెబ్ సిరీస్ లు చేస్తున్నట్లు సమాచారం. తమిళంలో సూపర్ స్టార్ రజినీ కాంత్ జైలర్ సినిమాలో కూడా తమన్నాకు ఛాన్స్ వచ్చింది. తెలుగులో రీసెంట్ గా సత్యదేవ్ తో కలిసి గుర్తుందా శీతాకాలం సినిమా చేసిన తమన్నా.. ఆ తర్వాత వేరే ప్రాజెక్టులు ఒప్పుకున్నట్లు లేదు.

## కుమారి మళ్లీ బోల్డ్ అటెంప్ట్ తో బరిలోకి?



ముంబై బ్యూటీ హెబ్బా పటేల్ టాలీవుడ్ కి ఉవ్వెత్తున దూసుకొచ్చి ఒక్కసారిగా చల్లబడింది. కుమారి 21 ఎఫ్‌లో బోల్డ్ అటెంప్ట్ తో యూత్ లో క్రేజీ భామగా మారిపోయింది. ఆ సక్సెస్ హెబ్బాకి మంచి ఐడెంటిటీని తెచ్చిపెట్టింది. అంతకు ముందు అలా ఎలా చిత్రం తో డీసెంట్ హిట్ వేసుకుంది. ఈ రెండు సక్సెస్ లు బ్యూటీకి టాలీవుడ్ లో పూల బాటనే వేసాయి. మీడియం రేంజ్ హీరోల సరసన బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేసింది. దాదాపు ఐదేళ్ల పాటు బిజీగానే కొనసాగింది. అయితే స్టార్స్ చిత్రంలో మాత్రం అవకాశం రాలేదు. ఈ క్రమంలో ఐటం భామగానూ లక్ ని చెక్ చేసుకుంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా నటించిన రెడ్ సినిమాలో ఓ ఐటం పాటలో నర్తించింది. కుమారి తర్వాత మరోసారి ఐటం పాటలో అందాల ఆరబోతలో తక్కువేం! కాదని నిరూపించింది. కానీ రెడ్ పరాజయంతో ఆ ఎ ఫెర్ట్ అంతా వృధ్ధా అయింది. ప్రస్తుతం రెండు మూడు సినిమాలు చేస్తోంది. కానీ ఆవేమి ప్రచారంలో లేని చిత్రాలు. తాజాగా హెబ్బా పటేల్ మరో బోల్డ్ అటెంప్ట్ కి రెడీ అయిందని గుసగుస వినిపిస్తోంది. ఓ రొమాంటిక్ సస్పెన్స్ థ్రిల్లర్ అందాల వడ్డనకు రెడీ అయిందని క్లోజ్ సోర్సెస్ చెబుతున్నాయి. అదే నిజమైతే హెబ్బా మళ్లీ ట్రాక్ లోకి వస్తున్నట్లే. అయితే ఇక్కడ బ్యానర్..దర్శకుడు ఎవరు? అన్నది చాలా కీలకం. బోల్డ్ గా ఎలాంటి ప్రయత్నాలు చేసినా పేరున్న బ్యానర్లో అయితేనే ఫేమస్ అయ్యేది. ఇలాంటి సస్పెన్స్ థ్రిల్లర్ లో నటించడం హెబ్బాకి ఇదే తొలిసారి. అయితే ఈ సినిమాపై కుమారి చాలా ఆశలే పెట్టుకుందని వినిపిస్తోంది. ఈ సినిమాతో ఎలాగైనా మళ్లీ లైమ్ లైట్ లోకి రావాలని ఆశపడుతోంది. హెబ్బా కెరీర్ లో సక్సెస్ ల పరంగా చూసుకుంటే కుమారి 21 ఎఫ్ నాన్న నేను బోయ్ ఫ్రెండ్ మినహా చిత్రాలు బాక్సాఫీస్ పెద్దగా రాణించలేదు ఈ రెండు చిత్రాల్లో కూడా హెబ్బా తన మార్క్ వేసింది. గ్లామర్ డోస్ పెంచి చేసిన రెండు చిత్రాలివి. ఆ తర్వాత గ్యాప్ లేకుండా సినిమాలైతే చేసిందిగానీ..కెరీర్ ని బిల్డ్ చేసుకోవడానికి ఆ సినిమాలేవి పెద్దగా ఉపయోగపడలేదు. ఈ నేపథ్యంలో బోల్డ్ అటెంప్ట్ ని నమ్ముకుని మరోసారి బరిలోకి దిగుతున్నట్లు సమాచారం. బోల్డ్ అటెంప్డ్ ని సక్సెస్ మంత్రంగా జపించి ప్రాజెక్ట్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. మరి ఆ సెంటిమెంట్ రిపీట్ అవుతుందా? లేదా? అన్నది అమ్మడి లక్ ప్యాక్టర్ పై ఆధారపడి ఉంటుంది. ఇక సినిమాల లైనప్ పరంగా చూసుకుంటే గీత అనే చిత్రం షూటింగ్ పూర్తిచేసింది. ఒడెలా రైల్వే స్టేషన్ తెలిసిన వాళ్లు అనే మరో రెండు చిత్రాల్లో నటిస్తోంది. ఈ మూడు కాక కొత్త అవకాశంతో మొత్తంగా నాలుగు సినిమాలు బ్యూటీ ఖాతాలో ఉన్నట్లు.

## ఆయనలోని ఆ తపనే నాకు నచ్చుతుంది: జాక్వెలిన్

బాలీవుడ్ బ్యూటీలలో జాక్వెలిన్ కి ప్రత్యేకమైన స్థానం ఉంది. మిగతా కథానాయికలకు భిన్నంగా ఆమె బాడీ లాంగ్వే జ్ ఉంటుంది. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలను మాత్రమే ఆమె అంగీకరిస్తూ ఉంటుంది. ఈ శ్రీలంక బ్యూటీ జాన్ అబ్రహంతో కలిసి తెరపై బాగానే సందడి చేసింది. గతంలో 'రేస్ 2' .. ' డిష్యుమ్' వంటి సినిమాలలో అలరించిన ఈ జంట ఇప్పుడు 'ఎటాక్ పార్టు 1'తో ప్రేక్ షాకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. లక్ష్య రాజ్ ఆనంద్ ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. 'ఏక్ థా టైగర్' .. 'బ్యాంగ్ బ్యాంగ్' వంటి సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్ గా .. 'రాకెట్ సింగ్' సినిమాకి దర్శకత్వం వహించిన లక్ష్యరాజ్ ఆనంద్ ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. యాక్షన్ .. యాక్షన్ కామెడీ సినిమాలకు కేరాఫ్ అడ్రెస్ గా చెప్పుకునే జాన్ అబ్రహం ఈ సినిమాలోను తనదైన మార్క్ చూపించే పాత్రలో కనిపించనున్నాడు. జయంతిలాల్ గడ - అజయ్ కపూర్ నిర్మించిన ఈ సినిమాకి జాన్



అబ్రహం కూడా ఒక నిర్మాతగా వ్యవహరించాడు. ప్రకాశ్ రాజ్ .. రకుల్ ప్రీత్ సింగ్ ముఖ్యమైన పాత్రలను పోషించిన ఈ సినిమాను 1వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ జోరందుకున్నాయి. బాలీవుడ్ లో ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ సినిమా టీమ్ కనిపిస్తోంది. తాజా ఇంటర్వ్యూలో జాక్వెలిన్ మాట్లాడుతూ .. "ఈ కథ చాలా కొత్తగా ఉంటుంది. సైన్స్ ఫిక్షన్ తో ముడిపడిన ఒక సూపర్ సోల్జర్ సినిమా ఇది. ఈ కథ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఇలాంటి ఒక సినిమాలో అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. జాన్ అబ్రహంతో కలిసి నటించడం ఎంతో సంతోషంగా .. సరదాగా ఉంటుంది. తన ప్రతి సినిమా విషయంలో ఆయన ఎంతగా కష్టపడతారనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అలాగే ఈ సినిమా విషయంలోను ఆయన ఎంతగా కష్టపడ్డాడనేది నేను ప్రత్యక్షంగా చూశాను. తన పాత్రకి న్యాయం చేయడం కోసం ఆయన పడే తపన నాకు ఎంతో నచ్చుతుంది.

ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం నాకు ఉంది" అంటూ చెప్పుకొచ్చింది. ఇక కొంతకాలంగా బాలీవుడ్ లో నిలదొక్కుకోవడానికి రకుల్ గట్టిగానే ప్రయత్నాలు చేస్తోంది. ఈ సినిమా హిట్ ఆమెకి మరింత అవసరం. అందువలన ఆమె కూడా ఈ సినిమా రిలీజ్ కోసం వేయి కళ్లతో వెయిట్ చేస్తోంది.

## ఇలా షాక్ ఇస్తే ఎలా సీతగారు.. మరో బికినీ డోస్

సీతారామం చిత్రంతో తెలుగు సినీ ప్రేక్షకుల గండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది హీరోయిన్ మృణాల్ ఠాకూర్. అందం అభినయంతో అందరినీ కట్టి పడేసింది. సీతారామం సినిమాలో నూర్జహాన్ పాత్రకు ప్రాణం పోసి.. అందరి మనసుల్లో సీతగా నిలిచిపోయింది. సంప్రదాయ పద్ధతిలో చక్కనైన చీర కట్టులో మెరిసిన ఈ బాలీవుడ్ బ్యూటీ.. పొట్టి పొట్టి గౌనుల్లో కూడా ట్రెండీగా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు తనకు సంబంధించిన సినిమా అప్ డేట్లతో పాటు ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. అయితే తాజాగా ఈమెకు సంబంధించిన ఓ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అందులో బికినీ వేసుకొని రచ్చ చేస్తోంది. స్లీవ్ లెస్ అండ్ డీప్ నెక్ ఉన్న ఓ టాప్ వేసుకున్న ఈమె... క్యూట్ గా చూస్తునే కుర్రకారు గుండెల్లో హీటు పుట్టిస్తోంది. అదిరిపోయే స్మైల్ ఇస్తూ అందిరినీ మెస్మరైజే చేసింది.



థైస్ అందాలన్నీ చాలా హైలెట్ చేస్తూ నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. పాంట్ వేసుకోవడం మర్చిపోయావా అని కొందరు.. అందాల ఆరబోతలో నిన్ను మించిన వారు లేరు హాటీ అంటూ మరికొంత మంది చెప్పుకొస్తున్నారు. మరికొందరేమో సీతారామం సినిమాలో సీతగా కనిపించింది నువ్వేనా అంటూ అడుగుతున్నారు. అప్పుడు అంత పద్ధతిగా కనిపించిన నువ్వు ఇంత హాట్ గా ఉంటావని అస్సలు అనుకోలేదంటూ తమ మనసులోని భావాలను వెల్లడిస్తున్నారు. చీరలో నీ అందం అమాయకత్వం అందరికీ నచ్చాయని నెటిజన్లు అంటున్నారు. కానీ ఇలా గ్లామర్ షో చేయడం నీ ఫ్యాన్స్ గా మాకు నచ్చట్లేదని మరికొంత మంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరి తన అభిమానులపై ఈ బాలీవుడ్ బ్యూటీ ఎలా స్పందించనుందో తెలియాలంటే ఇంకా కొంత కాలం ఆగాల్సిందే. 2014లో మరాఠీ సినిమా విట్టి దండుతో సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ బ్యూటీ.. ప్రస్తుతం వరుస ఆఫర్లతో దూసుకెళ్తోంది. సీతారామం సినిమా తర్వాత ఆమె అరడజనుకు పైగా సినిమాల్లో ఛాన్స్ కొట్టేసిందంటూ వార్తలు వచ్చాయి. ఇదే నిజమైతే ఆమె త్వరలోనే టాప్ స్టార్ హీరోయిన్ గా పేరు దక్కించుకోవడం ఖాయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీతారామం సినిమా తర్వాత పారితోషికం విషయంలో కూడా ఈ బాలీవుడ్ బ్యూటీ ఏమాత్రం వెనక్కు తగ్గట్లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.



# ప్రగతి పథకాలతో పల్లె, పట్టణాల రూపురేఖలే మారిపోయాయి : సీఎం కేసీఆర్

హైదరాబాద్ : రాష్ట్ర ఆవిర్భావం జరిగిన వెంటనే దశాబ్దాల తరబడి ప్రజలను పీడిస్తున్న అనేక గడ్డు సమస్యలను ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించిందని సీఎం కేసీఆర్ అన్నారు. అస్తవ్యస్తంగా తయారైన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సంపూర్ణ పరివర్తనను సాధించేందుకు పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పేరుతో సమగ్ర ప్రణాళిలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ ప్రణాళికలు అద్భుతమైన ఫలితాలను సాధించాయని గుర్తు చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సచివాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను సీఎం కేసీఆర్ లాంఛనంగా ఆరంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

**ఆనాడు పట్టణాలు నరకానికి నకళ్లుగా కనిపించేవి :** ‘ ఒకప్పుడు తెలంగాణ పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా చెత్తా చెదారం పేరుకుపోయి కనిపించేది. పరిసరాలు అపరిశుభ్రంగానూ, దుర్గంధ భూయిష్టంగానూ ఉండేవి. పాడుబడిన ఇళ్ల శిథిలాలు నిరుపయోగమై, ప్రమాదకరంగా ఉన్న బావులు, పసిపిల్లలు పడిపోయే విధంగా బోరు పొక్కలు వంగి, మెలికలు తిరిగిన, విరిగి పోయిన విద్యుత్ స్తంభాలు, జారిపోయి ఎక్కడ షాక్ కొడతాయో అనేలా వేలాడుతూ భయపెట్టే విద్యుత్ తీగెలు, గుంతలమయమైన రోడ్లు, బురదమయమైన వీధులు, పిచ్చిచెట్ల పొదలు, మురుగు పేరుకుపోయిన కాల్వలు, మిణుకు మిణుకుమనే వీధిలైట్లతో, పల్లెలు మురికికూపాల్లా ఉండేవి, పట్టణాలు నరకానికి నకళ్లుగా కనిపించేవి. చివరికి ఎవరైనా మరణిస్తే, వారికి గౌరవప్రదంగా అంత్యక్రియలకు కూడా స్థలం వెతుక్కోవాల్సిన అనాగరిక స్థితి ఆనాడు ఆవరించి ఉండేది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా, పల్లెలు, పట్టణాల సమగ్రాభివృద్ధి కోసం చేపట్టిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు గ్రామాల, పట్టణాల రూపురేఖలనే మార్చివేశాయి.’ అని సీఎం కేసీఆర్ అన్నారు.

**స్థానిక సంస్థల పనితీరులో అద్భుతమైన మార్పు :** ‘ నేడు పల్లెలు, పట్టణాలు మౌలిక వసతులతో పరిశుభ్రతతో, పచ్చదనంతో ఆహ్లాదకరంగా రూపొందాయి. ఈ పరిణామం అంత సులభంగా జరగలేదు. పటిష్టమైన చట్టాలు, సమగ్రమైన ప్రణాళిక, యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతుల నిర్మాణం చేయడం వల్లనే ఈ అద్భుతమైన పరివర్తన సాధ్యమైంది. 2014 ముందు స్థానిక సంస్థలకు తమ బాధ్యతలు, విధులకు సంబంధించి సరైన మార్గనిర్దేశనం ఉండేది కాదు. జవాబుదారీతనం లేని స్థానిక నాయకత్వం రాజకీయాలకు, పైరవీలకే పరిమితమయ్యేది. దీంతో పల్లెలు, పట్టణాల పరిస్థితి అధ్వాన్న దశలో ఉండేది. స్థానిక సంస్థల పనితీరును మార్చేందుకు ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని, పురపాలక చట్టాన్ని ప్రవేశ పెట్టింది. నాయకులు, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, పారదర్శకంగా, బాధ్యతాయుత పాలన అందించే విధంగానూ, పన్నులు సమర్థవంతంగా వసూలు చేయడంతోపాటూ, పారిశుద్ధ్యం, పచ్చదనం పెంచే విధంగానూ వారికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించింది. లక్ష్యాల సాధనలో అలసత్వం ప్రదర్శించిన, నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులతోపాటూ, ప్రజాప్రతినిధులపై సైతం కఠిన చర్యలు తీసుకునే నిబంధనలను ఈ చట్టంలో పొందుపరిచింది. దీంతో స్థానిక సంస్థల పనితీరులో అద్భుతమైన మార్పు వచ్చింది.’ అని సీఎం కేసీఆర్ తెలిపారు.

# పోరాట యోధుడే పాలకుడై.. మంత్రి కేటీఆర్ ట్వీట్




హైదరాబాద్: ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఇవాళ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు 10వ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన ట్విట్టర్‌లో విషెస్ చెబుతూ ఓ కవితను ట్వీట్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం సీఎం కేసీఆర్ ఓ యోధుడిలా పోరాడారని, ఈ రాష్ట్రానికి ఆయనే పాలకుడయ్యారని, ఆ సాధించిన తెలంగాణను సగర్వంగా.. దేశంలోనే అగ్రపథాన నిలిపినట్లు పేర్కొన్నారు. తెలంగాణ నేల దశాబ్ది వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు చెబుతున్నట్లు కేటీఆర్ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఉద్యమకాలం నాటి ఓ ఫోటోను ట్వీట్ చేసిన మంత్రి కేటీఆర్.. కేవలం పదేళ్లలోనే తెలంగాణ రాష్ట్రం వందేళ్ల ప్రగతికి సాక్షిగా నిలిచినట్లు తెలిపారు.

# తెలంగాణ రావడానికి మొదట ప్రతిపాదనలు ఇచ్చింది చంద్రబాబు..




హైదరాబాద్: టీటీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భవన్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం ఒక చరిత్ర అని, తెలంగాణ రావడానికి.. ఇవ్వడానికి అసెంబ్లీ నుంచి మొట్టమొదటి ప్రతిపాదనలు ఇచ్చింది చంద్రబాబు నాయుడని అన్నారు. 60 సంవత్సరాల తర్వాత తెలంగాణ రావడం సంతోషమన్నారు. తెలంగాణ ప్రజలు, యువత.. కన్న తెలంగాణ మనకు రాలేదని, నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. తెలంగాణ రాలేదని ఆనాడు యువత ఆత్మ బలిదానాలు చేసుకున్నారని, తెలంగాణ వచ్చిన తర్వాత ఏం అభివృద్ధి చేయాలో అది చేయలేదని కాసాని జ్ఞానేశ్వర్ విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదు కానీ.. పెద్ద స్థాయిలో తెలంగాణ సచివాలయాన్ని నిర్మించారని అన్నారు. రాష్ట్ర ఖజానాలో డబ్బులు లేవు కానీ.. లీడర్ల దగ్గర డబ్బులు ఉన్నాయన్నారు. ఉద్యోగస్తులకు జీతాలు రావడం లేదని.. తెలంగాణ ప్రజలు కోరుకున్న తెలంగాణ రావాల్సిందేనని.. ఇలాంటి దుష్ట ప్రభుత్వం పోవాల్సిందేనని.. యువత ఆలోచించాల్సిన సమయం వచ్చిందని కాసాని జ్ఞానేశ్వర్ వ్యాఖ్యానించారు.

# రాజకీయాల నుంచి రిటైర్డ్ అవుతా.. ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: రాజకీయాల నుంచి రిటైర్డ్ అవుదామని అనుకుంటున్నట్లు కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఉత్తమ్ మాట్లాడుతూ.. కమర్షియల్ రాజకీయాలకు తాను సెట్ కానని అన్నారు. ఏదో ఒక మంచిరోజు చూసుకొని రాజకీయాల నుండి రిటైర్డ్ అవుదామని అనుకుంటున్నట్లు తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి వస్తాయని అనుకుంటున్నానని అన్నారు. మోదీ చరిష్మతో ఎన్నికలకు వెళ్దామని బీజేపీ అనుకుంటుందని.. రెండు ఎన్నికలు ఒకేసారి వస్తే కాంగ్రెస్‌కే లాభమని చెప్పుకొచ్చారు. శరత్ రెడ్డి అప్రూవర్‌గా మారితే లిక్కర్ కేసు సీరియస్‌గా టర్న్ అవుతుందన్నారు. శరత్ రెడ్డి నిజంగా అప్రువర్ గా మారితే అది ఆప్‌కు చావుదెబ్బ అని ఎంపీ చెప్పుకొచ్చారు. వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల కాంగ్రెస్‌లోకి వస్తుందో లేదో తనకు తెలియదని.. కాంగ్రెస్ నుంచి ఎవరో పెద్దవాళ్ళు షర్మిలతో మాట్లాడినట్టు అనిపిస్తోందన్నారు. బీజేపీ ఊపు తగ్గుతోందన్నారు. బీజేపీలో ఎవరు మాట్లాడినా సీరియస్‌గా ఆ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని తెలిపారు. బీజేపీలో ఇన్ సైడర్స్ వర్సెస్ అవుట్ సైడర్స్ నడుస్తోందని అన్నారు. 2018 నుంచి రాజకీయాలు చాలా కమర్షియల్‌గా మారాయన్నారు. ఈ కమర్షియల్ రాజకీయాల నుంచి తప్పుకుంటే గౌరవంగా ఉంటుందని అనుకుంటున్నట్లు వెల్లడించారు. 30 సంవత్సరాలు అయ్యాయి కాబట్టి అక్టోబర్‌లోనో, నవంబర్‌లోనో రాజకీయాల్లో నుంచి తప్పుకుంటే బాగుంటుందని అనుకుంటున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# ఇంకా తెలంగాణ పసి బిడ్డగానే ఉంది...

హైదరాబాద్: తెలంగాణ పదో సంవత్సరంలో అడుగుపెడుతోందని, ఇంకా తెలంగాణ పసి బిడ్డగానే ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో అనేక వనరులు ఉన్నాయని.. అన్నీ ఉండి ఇంకా ఎందుకు నిరుద్యోగులు అలమటిస్తున్నారని ప్రశ్నించారు.

దీని కోసం తెలంగాణ సాధించుకున్నది కాదని అన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేశారని, బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ కూడా అటు ఇటు అనే ఆట ఆడాయని నారాయణ విమర్శించారు. సీపీఐ మాత్రమే తెలంగాణకు మద్దతుగా నిలిచిందన్నారు. ప్రస్తుతం సీఎం స్వాముల చుట్టూ తిరుగుతున్నారని, అసలు బీజేపీకి బుద్ధి ఉందా? అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి కేంద్ర హోం మంత్రిని కలవగానే శరత్ చంద్ర రెడ్డి అప్రువర్‌గా మారుతారని, కవితకి సాఫ్ట్ అవుతుందని, అవినాష్ రెడ్డికి బెయిల్ వస్తుందని, ఇదంతా క్విడ్ ప్రో కో మాదిరిగా మారిందన్నారు.

**మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ** తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని అనుకున్నారు. కానీ ఇందులో కొంత ముందుకు పోయిన ఇంకా వెనకబడి ఉందని చాడ వెంకటరెడ్డి అన్నారు. కేంద్ర బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కృష్ణ జలాల వాటా ఇంతవరకు తేల్చలేదని, ఇంకా ఆకాంక్షలు నెరవేరలేదని అన్నారు. ధరణి పోర్టల్ పూర్తిగా దరిద్రపు పోర్టల్ అని.. 8 లక్షల మంది రైతులు బజారున పడి తిరుగుతున్నారని అన్నారు. కేసీఆర్ మాన్యువల్ మెయింటైన్ చేస్తాం అన్నారని.. ఇంత వరకు చేయలేదని చాడ వెంకటరెడ్డి అన్నారు.



తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కళాకారులతో కలిసి నృత్యాలు చేశారు.

# తెలంగాణ అంటే హైదరాబాద్ మాత్రమే కాదు: గవర్నర్ తమిళిసై



హైదరాబాద్: అనేక రంగాల్లో తెలంగాణ ప్రత్యేకత చాటుకుంటోందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో గవర్నర్ మాట్లాడారు. హైదరాబాద్ సహజసిద్ధ అనుకూలతతో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రం అంటే హైదరాబాద్ మాత్రమే కాదని.. మారుమూల పల్లెలకు కూడా అభివృద్ధి ఫలాలు అందాలని ఆమె వ్యాఖ్యానించారు. “నీళ్లు, నిధులు, నియామకాల ఆకాంక్షలతోనే తెలంగాణ ఉద్యమం వచ్చింది. అంటే కొందరు మాత్రమే కాదు.. అందరూ అభివృద్ధి చెందాలి. జై తెలంగాణ అంటే కేవలం ఒక నినాదం మాత్రమే కాదు. జై తెలంగాణ అంటే ఆత్మగౌరవానికి చిహ్నం. నా జీవితంలో ప్రతి నిమిషం ప్రజల కోసమే. రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ఖ్యాతి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. రాష్ట్రాభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐలు చేయూత అందివ్వాలని కోరుతున్నాను. సరికొత్త తెలంగాణ రాష్ట్రాన్ని ఆవిష్కరించుకుందాం. తెలంగాణను దేశంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దుకుందాం” అని తమిళిసై అన్నారు.

# బాధతో ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నాం



హైదరాబాద్: బీజేపీ మద్దతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీజేపీ కార్యాలయంలో బండి సంజయ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మోదీ ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రానికి కేంద్రం 4 లక్షల కోట్ల నిధులు విడుదల చేసిందని చెప్పారు. రాష్ట్రంలో మూరత్వపు పాలన కొనసాగుతోందన్నారు. నలుగురి కోసం మాత్రమే రాష్ట్రం ఏర్పడినట్టు ఉందని.. రాష్ట్ర సాధన ఆకాంక్షలు నెరవేరలేదని విమర్శించారు. బాధతో ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఫీజ్ రీయింబర్స్మెంట్ ముందుగానే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఉచిత విద్య, వైద్యం అందిస్తామని... నిలువ నీడ లేని పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలు చేపడతామని స్పష్టం చేశారు. పంట నష్టపరిహారం 10 వేల ఇస్తానని చెప్పిన కేసీఆర్ ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే ఫసల్ బీమాను రాష్ట్రంలో అమలు చేస్తామన్నారు. నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక కూడా నిరుద్యోగుల ఆత్మహత్యలు చేసుకోవడం కంటే దుర్మార్గం ఇంకొక్కటి ఉందా అని నిలదీశారు. 21 రోజులు.. రోజుకో డిపార్ట్‌మెంట్ బీఆర్ఎస్‌కు ప్రచారం చేయాలని ఉద్యోగుల మీద ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అని ప్రజలు నమ్ముతున్నారన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు అభ్యర్థులు గల్లంతయ్యారని అన్నారు. అనేక మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అడ్రస్ గల్లంతైన పార్టీ కాంగ్రెస్ అంటూ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌ను లేపే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మోడీ సహకరించినా కేసీఆర్ దానికి సిద్ధంగా లేరన్నారు. గడిల పాలనను అంతమొందించడానికి బీజేపీ ముందడుగు వేస్తోందని తెలిపారు. ఒక కుటుంబం చేతిలో బంధీఅయిన తెలంగాణ తల్లిని విడిపించడానికి బీజేపీని రాష్ట్ర ప్రజలు ఆదరిస్తున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కేంద్ర సాంస్కృతిక శాఖ తరఫున గోల్కొండ కోటలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అమరవీరులను స్మరించుకుందామన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు తమ జీవితాలను పణంగా పెట్టారని, నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమం సాగించామన్నారు. అలుపెరగని పోరాటంతో ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామని, కేవలం ఒక్క కుటుంబం, పార్టీ ద్వారానే తెలంగాణ రాలేదని వ్యాఖ్యానించారు. సకలజనులు పోరాడితేనే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని, ఆనాడు బీజేపీ మద్దతు వల్లే తెలంగాణ వచ్చిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ.. ఒక కుటుంబానికి బానిసగా మారిందని, లిక్కర్‌లో, లీకేజీలో, ప్రాజెక్టుల్లోనూ మాఫియాలే ఉన్నారని కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణను అప్పులకుప్పగా మార్చేశారని, అప్పుల కోసమేనా తెలంగాణ సాధించుకుంది? అంటూ కేసీఆర్ సర్కార్‌పై ఫైర్ అయ్యారు. ఏ ఒక్క హామీని కేసీఆర్ నెరవేర్చలేదని, ఫామ్‌హౌస్‌ల మీద ఫామ్‌హౌస్‌లు పెరుగుతున్నాయని అన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు మాత్రం రావట్లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్‌లు తొలగిస్తే గిరిజనులకు చట్టపరమైన రిజర్వేషన్‌లు అమలవుతాయని కిషన్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉద్యమం ద్రోహులకు ప్రభుత్వంలో పెద్దపీట వేశారని, అధికారంలో ఉన్న పార్టీ నేతల కుటుంబాలు బంగారంగా మారాయన్నారు. తెలంగాణలోని సకల రంగాల్లో అవినీతి, అహంకారం, కుటుంబ పాలన, నియంతృత్వం తప్ప మరేదీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్‌లతో పూర్తి సమస్యలు పరిష్కారం కావని, బస్తీలలో నీటికోసం, డ్రైనేజీ వ్యవస్థ, ఇల్లు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసిందో ప్రజలకు వివరిస్తామన్నారు. దేశంలో ఆదర్శవంతమైన, నీతివంతమైన పాలన అందిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజ్‌భవన్‌లో 1969 తెలంగాణ సాయుధ పోరాటయోధులను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సత్కరించారు.

# తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు




హైదరాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాజధాని వరకు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్వహించిన వేడుకల్లో మంత్రులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు అమరవీరులు చేసిన కృషి.. ఈ పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం సాధించిన విజయాలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ శాసనసభ ఆవరణలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి వద్ద ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద కేటీఆర్, సిద్దిపేటలో హరీశ్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ దశాబ్ది వేడుకల్లో పాల్గొన్నారు. కరీంనగర్‌లో గంగుల కమలాకర్, ఖమ్మంలో పువ్వాడ అజయ్, నిజామాబాద్‌లో ప్రశాంత్‌రెడ్డి, జనగామలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, మెదక్‌లో తలసాని శ్రీనివాస్‌యాదవ్, వనపర్తిలో నిరంజన్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌లో శ్రీనివాస్‌గౌడ్, సరూర్‌నగర్‌లో సబితా ఇంద్రారెడ్డి, సంగారెడ్డిలో మహమూద్ అలీ, నిర్మల్‌లో ఇంద్రకరణ్‌రెడ్డి, మహబూబాబాద్‌లో సత్యవతిరాథోడ్, మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం వద్ద మల్లారెడ్డి జాతీయ పతాకాలను ఎగురవేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com